# కర్నూలు | నంద్యాల వార్త

11 జనవరి , 2025 | శనివారం | పేజీలు 4


## ఇప్పటికైనా నిజాలు మాట్లాడవయ్యా పార్థసారథి..!

**- ప్రజలను దోచుకోవడానికే నువ్వు వచ్చావా..: మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి**

**ఆదోని అర్బన్,జనవరి 10,ప్రభాతవార్త**

ఎమ్మెల్యే పార్థసారథి మాయమాటలు చెప్పి ముసిముసి నవ్వులతో ప్రజలను దోచుకోవడానికి నువ్వువచ్చినట్లు ప్రజలందరు అనుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే,వైసిపి ఇంచార్జ సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పార్థసారథి ఇప్పటికైనా నిజాలు మాట్లాడితే బాగుంటుందన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు సాయిప్రసాద్‌రెడ్డి అదిచేశాడు..ఇది చేశాడు..అని మభ్యపెట్టే మాటలకు బదులు ఏమి చేశాడో రుజువు చేస్తే బాగుంటుంది కదా అన్నారు. రిజిస్టర్ ఆఫీసులో ఏ రిజిస్ట్రేషన్ జరిగినా ఎమ్మెల్యేకు తెలియకుండ జరగడకూడదని మరీ షరతులు పెట్టి మామూళ్ల వసూలు చేస్తున్నది ఎవరో ప్రజలందరికి తెలుసునని,బినామీలను పెట్టి వసూలు చేసినంత మాత్రాన ప్రజలకు తెలియదు అనుకోవడం నీ మూర్ఖత్వమన్నారు. గరుసు మాఫియా,బియ్యం మాఫియాలను ప్రోత్సహిస్తూ ఆదోని నియోజకవర్గాన్ని దోచుకుతింటున్నాడని మండిపడ్డారు. తన సన్నిహితుడు డాక్టర్ కిరణ్ భూకబ్జా చేశాడని పెద్దఎత్తున నిరసనలు వచ్చి అవి రుజువైనా ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోలేకపోయారని దీని వెనుక ఎవరున్నారో కూడా ప్రజలకు తెలుసునని అన్నారు. అలాగే గుడిసె ఆది కృష్ణమ్మ కూడా తన గురించి అవి..ఇవీ..బయటపెడతానని చెప్పడమే తప్ప ఏవీ బయటపెట్టిందే లేదని ఏవైనా ఉంటే ప్రజల ముందు పెట్టాలని



ఆయన సూచించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే అనుచరులు ఒక్కొక్క మద్యం దుకాణం నుండి రూ.70వేలు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భయపెడితే భయపడే వ్యక్తులు వైసిపిలో ఎవ్వరూ లేరన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే పార్థపారథి మాయమాటలు చెప్పడం మాని ఆదోని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చంద్రకాంత్‌రెడ్డి,వైస్ చైర్మన్ నరసింహులు,ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మండల అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి బీసీ

**బనగానపల్లెరూరల్, జనవరి10, ప్రభాతవార్త:**

మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది తదితర అధికారులతో శుక్రవారం రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పట్టణంలోని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో తాగునీరు, పారిశుద్ధ్యం పై అధికారులు దృష్టిసారించాలన్నారు. ఈ మేరకు మండలంలోని అన్ని గ్రామాలు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అదే విధంగా మన చుట్టుపక్కల పరిసరాల పరిశు భ్రంగా ఉంచుకోవాలని ప్లాస్టిక్ రహిత బనగానపల్లె లక్ష్యంగా పని చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల కనీస అవసరాలైన తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వంటి వాటి పై దృష్టిపెట్టాలన్నారు. అదే విధంగా పారిశుద్ధ్య సిబ్బంది ఎంతగానో కష్టపడుతున్నారని వారి వేతనాలు పెంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో బి.వి.రమణ, ఈవోఆర్డీ సతీష్‌కుమార్ రెడ్డి, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, టిప్‌టాప్ కలాం, మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# సామాజిక తనిఖీ..అక్రమాల పునికి..!

- జరిగిన పనులు రూ.16.55 కోట్లు..బయట పడింది మాత్రం రూ.11.57లక్షలు..
- పెనాల్టీలు రూ.86 వేలు..పనుల వద్ద నేమ్ బోర్డులు ఏమయ్యాయి..
- ఉపాధిహామీ పథకం 2023-24లో జరిగిన పనులపై సోషల్ ఆడిట్..
- ఉపాధిహామి తనిఖీలో అక్రమాలపై జిల్లా పీడీ ఆగ్రహం..



**గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులకు, సిబ్బందికి కాసుల వర్షం కురపించే కల్పతరువుగా మారింది.. మండల వ్యాప్తంగా 1210 పనులకు సంబందించి వివిద శాఖలపనుల మెటీరియల్‌కు 4.50 కోట్లు, వేజ్‌కు సంబందించి 12 కోట్లు మొత్తం రూ.16 కోట్ల 55 లక్షలు ఖర్చు చేసారు..సామాజికతనిఖీలో భాగంగా కేవలం రూ.11.57లు అవినీతి జరిగినట్లు నిరూపించి రికవరీకి ఆదేశాలు జారీ చేసారు.. అలాగే వివిధ పనులపైరూ.86 వేలు పెనాల్టీలు వేసారు.. మండలంలో దాదాపు రూ.2కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు అవినీతి జరినట్లు ప్రజల నుండి గుసగుసలు వినిపిస్తున్నాయి.. అంతేకాక గ్రామా లల్లో లేని వారి పేర్ల ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్లలో వేసుకుని పెద్ద ఎత్తున ఉపాధి అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది.. వివరాల్లోకి వెళ్లితే..**




**కోసిగి, జనవరి 10, ప్రభాతవార్త**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 17వ విడత సామాజిక తనిఖీలో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలనుండి స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణంలో ప్రజా వేదిక కార్యక్రమాని జిల్లా డ్వామా పీడి ఆధ్వర్యంలో నిర్వహించారు..ఈ సందర్భంగా ఎంపీపీ లవకుశ ఈరన్న అధ్యక్ష తన, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎన్ఆర్ జిఎస్ పీడి వెంకటరమణయ్య, అడిషనల్ పీడి మాధవిలతల ఆధ్వర్యంలో మండలంలోని 24 గ్రామ పంచాయతీ లకు సంబందించి ఏఏ పనులు చేపట్టడం జరిగిందో ఎంతెంత ఖర్చు చేసారో వివ రంగా ప్రతి పనికి సంబందించిన నివేధి కలు చదివి వినిపించారు.. ముఖ్యంగా 01.04. 2023 నుండి 31.03.2024 వరకు 17వ విడత సామాజిక తనిఖీలో భాగంగా ఈ పనులు చేపట్టినట్లు ప్రజా వేధిక సందర్భంగా తెలియజేసారు.. ఇందులో దాదాపు కోట్ల రూపాయల వరకు గుర్తించిన పనులపై ఖర్చు చేసినట్లు వారు సభ వేధిక మీదుగా ప్రజలకు, ప్రజాప్రతినిధుల సమక్షంలో తెలపడం జరిగింది.. ఈ సందర్భంగా డ్వామా పీడీ వెంకటరమణయ్య టెక్నికల్ అసిసెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీల విషయంలో అసహనం వ్యక్తం చేసి అక్రమాలపై మండిపడ్డారు.. ఎక్కడైతే పనులు జరిగాయో ఆ పనుల వద్ద పనులకు సంబందించిన నేమ్‌బోర్డులు ఏమయ్యా యి అని ఉపాధి సిబ్బందిని నిలదీసారు.. పద్దతులు మార్చుకోక పోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. చాలా పనుల్లో వేతనాలు పక్కదారి మళ్లినట్లు అధికారులు ధ్రువీకరించారు.. ఈ సందర్భంగా పిడి వెంకటరమణయ్య వివరాలను తెలుపుతూ మండలంలోని 24 గ్రామాలలో మొత్తం 1210 పనులు జరిగినట్లు తెలిపారు. ఈ ఉపాధి పనులకు సంబందించి రూ. వేజ్ కింద రూ.12,04,38,080లు,అలాగే మెటీరియల్ కింద రూ.4,50,75,581లు మొత్తం రూ.16,55,13,661లు వ్యయం అయినట్లు వీటికి సంబందించి పనుల్లో పురోగతికనిపించలేదన్నారు.. ముఖ్యంగా పలు గ్రామాల్లో జరిగిన పనుల్లో నిదులు భారీగా పక్కదోవ పట్టాయని తెలిపారు.. ఇందులో భాగంగాసుమారు రూ.11,57,339లు రివకరీకి ఆదేశాలు జారీ చేసామన్నారు.. అలాగే పెనాల్టీ ద్వారా రూ.86వేలు అపరాధ రుసుంను జరిమాన జరిమాన విధించి నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిడి లోకేశ్వర్, ఎస్ఆర్‌పి నాగార్జున, జిల్లా విజిలెన్సు అధికారి ఆదినారాయణ, పిఆర్ఏఈలు మాలిక్, యుగంధర్‌రెడ్డి, డిఆర్‌పిలు, నాయకులు ముత్తారెడ్డి, జ్ఞానేష్, తోవి రామకృష్ణ, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు..

## గోకులంషెడ్లను ప్రారంభించిన ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి

**పగిడ్యాల, జనవరి 10,ప్రభాతవార్త**

నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం కొత్త ముచ్చుమర్రి, పాతముచ్చుమర్రిలో శుక్రవారం 3 గోకులం షెడ్లను నంద్యాల ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ కొత్తముచ్చుమర్రిలో సోహిల్, రమేష్ లబ్దిదారులకు సంబంధించి రెండు గోకుల షెడ్లకు రూ. 3.80లక్షలు, పాతముచ్చుమర్రిలో వెంకటరమణ లబ్దిదారుడు గోకులం షెడ్డుకు రూ. 1.80లక్షల విలువచేసే గోకులం షెడ్డును ప్రారంభించడం జరిగిందన్నారు. పశుపోషణకు గోకులం షెడ్లు ఎంతో ఉపయోగపడతాయనీ అన్నారు. ప్రభుత్వం రైతులకు ప్రోత్స హించేందుకు పశుసంపద పెంపొందించుకునేందుకు పశువుల ఆరోగ్యపరిరక్షణకు కృషిచేస్తుందన్నారు. గొకులంషెడ్ నిర్మాణానికి సబ్సీడి అందజేస్తుందన్నారు. అర్హులందరికీ గోకులంషెడ్లు మంజూరు చేస్తుందనీ, గోకులం షెడ్లను ఏర్పాటు చేసుకుని పశుసంపదను సంరక్షించుకోవాలనీ ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీమతి సుమిత్రమ్మ, ఎపిడి అన్వరాబేగం, ఎపిఓ మద్దిలేటి, మాజీ జెడ్పీటిసి నాగేశ్వరరావు, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ తలముడిపి మహేష్‌నాయుడు, ఈసి, టెక్నికల్ అసిస్టెంట్, గ్రామనాయకుడు వెంకటరామిరెడ్డి , తదితరులు పాల్గొన్నారు.



## హరిదాసుల గళం.. మూగబోతోంది!

**- సంక్రాంతి అంటేనే గంగిరెద్దుల విన్యాసాలు..**
**- వినిపించని హరిదాసుల సంకీర్తనలు..**

**కోసిగి, జనవరి 10, ప్రభాతవార్త**

"తెలుగు వారికి అన్ని పండుగల్లో సంక్రాంతి పర్వదినం అతి ముఖ్యమైనది.. ఏడాది పొడవునా కష్టించిన పంటలక్ష్మిని ఇంటికి తెచ్చుకున్న కష్టజీవులైన రైతులందరూ ఆనందోత్సహాల మధ్య జరుపుకునే పండుగా భావిస్తారు..సంక్రాంతి వచ్చిందంటే గ్రామాల్లో పండుగ శోభతో పాటు హరిదాసుల భక్తి గీతాలు, గంగిరెద్దుల విన్యాసాలు పల్లెలకు ప్రత్యేక ఆనందాన్ని ఇస్తాయి.. ముఖ్యంగా శ్రీమద్రామాయణ హరి అంటూ రామనామ స్మరణ, గోవిందో హరితో ఇంటింటికి తిరిగే హరిదాసులు, వారి సంగీతంతో భక్తి శ్రద్దలను ప్రజల్లో నింపడంఓ ప్రధాన సాంప్రదాయంగా ఉండేది.. కానీ ఆధునికత ప్రభావంతో ఈ సంప్రదాయం కూడా క్రమంగా కనుమరుగవుతోంది.. హరిదాసులు భక్తి గీతాలు పాడుతూ, కీర్తనలు చెప్పుతూ గ్రామాల ప్రజలకు ఆధ్యాత్మికతను చేరువ చేసేవారు.. భక్తి, ధర్మం, నైతికతలకు ప్రతీకగానిలిచిన హరిదాసుల గళం ఇప్పుడు అరుదుగా మాత్రమే వినిపిస్తోంది"..సంక్రాంతి పర్వదినంకు ముందు ధనుర్మాసంలో మాత్రమే హరిదాసులు కనబడుతారు.. మళ్లీ సంవత్సరం దాకా వీరు రారు.. శ్రీ మహా విష్ణువుకు ప్రతినిధులుగా చెప్పుకునే హరిదాసులు వద్దనున్న అక్షయ పాత్రలో బియ్యం పోస్తే తెలుసో తెలియకో మనం చేసిన ఎన్నోపాపాలు తొలగిపోతాయని పెద్దల ఉవాచ..హరిదాసులు అనగా పరమాత్మతో సమానం.. మనుషులు ఇచ్చే దాన ధర్మాలు అందుకునివారికి ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలు కలగాలని దీవించే వారే హరిదాసులు..హరిదాసులు తన తలపై ధరించే పంచలోహ పాత్రనుసూర్య భగవానుడు ప్రసాదించిన అక్షయపాత్రగా భావిస్తారు..సంక్రాంతికి ముందు నెలరోజుల పాటు సూర్యోదయానికి ముందే శ్రీ కృష్ణగోదాదేవిని స్మరించి తిరుపవై పట్టించి అక్షయపాత్రను ధరించి గ్రామ సంచారం ప్రారంభిస్తారు..ముఖ్యంగా కాషాయ వస్త్రాలు ధరించి,ముఖంపై నామాలు దిద్దుకుని మెడలో పూలమాలను



రుద్రాక్ష మాలలను ధరించి నెత్తిమీద నామాలతో అలంకరించిన అక్షయపాత్రను పెట్టుకుని భుజం మీద తంబూరను మీటుతూ ఒక చేత్తో చిడతలతో తాళం వేస్తూ శ్రావ్యంగా పాటలు పాడుతూ కాళ్ల గజ్జెలతో నృత్యం చేస్తూ హరిలో రంగ హరి అంటూ ప్రతి ఇంటి ముంగిట దర్శనమిస్తారు..అటువంటి హరిదాసుకు ఇంటి పెద్దలు, పిల్లలు ఫల పుష్పాదలతోదోసెడు బియ్యం తీసుకు వస్తే హరిదాసు వినమ్రతతో మోకాలుపై కూర్చోని అక్షయపాత్రలో వేయించుకుని ఆ ఇంటి కుటుంబాన్ని దీవిస్తారు.. ఇలా ఒక్కరితో పాటు మరి కొంతమంది హరిదాసులు కూడా గ్రామీణ ప్రాంతాల్లో తిరగడం వల్ల పల్లెటూర్లు కోలాహలంగా కనిపిస్తాయి..

**తగ్గిపోతున్న హరిదాసుల సంప్రదాయం:** ఆధునిక జీవనశైలి ప్రభావం పట్టణీకరణ, సాంకేతికత పెరిగినప్పటికీ గ్రామీణ జీవనంలో ఆధ్యాత్మకత, సంప్రదాయాలపై ఆసక్తి తగ్గుతోంది..ఆర్థిక సమస్యలు నెట్టుకొచ్చేవారు.. ముఖ్యంగా హరిదాసులు బిక్ష లేదా దానంపై ఆధారపడి జీవనం సాగించేవారు.. ఇప్పుడు ఆ సహకారంసమాజంలో తగ్గిపోవడం వారి జీవనానికి ఇబ్బంది కలిగిస్తోంది..

యువతలో ఆసక్తి తగ్గుదలం: నేటి తరంలో యువత హరిదాసుల సంప్రదాయాన్ని తీసుకుని వెళ్లే ఆసక్తి కనబరచడం లేదు.. హరిదాసుల సంప్రదాయం పునరుజ్జీవనంకోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి..హరిదాసుల పాటలను సేకరించి భజన రూపంలో ప్రాచుర్యం కల్పించాలి..

## భూ సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి : జిల్లా కలెక్టర్

**నంద్యాల, జనవరి 10ప్రభాతవార్త ప్రతినిధి :**

భూమి రికార్డులలో మ్యూటేషన్ల దిద్దుబాటు, రెవెన్యూ సదస్సుల్లో భూ పరిష్కార నిమిత్తం స్వీకరించిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి నిర్ణీత కాలపరిమితి లోగా పరిష్కార మార్గాలు చూపాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మండల తాసిల్దార్లు, ఆర్డీఓలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ తో కలిసి భూ సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. డిఆర్ఓ రాము నాయక్, ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అన్ని మండలాల తాసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ భూమి రికార్డులలో మ్యూటేషన్ల దిద్దుబాటు కోసం పెండింగ్లో ఉన్న దరఖాస్తులతో పాటు రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను కూడా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఆళ్లగడ్డ, బండి ఆత్మకూరు, పాములపాడు, నందికొట్కూర్, నంద్యాల అర్బన్, రూరల్ పాణ్యం, పగిడ్యాల తదితర మండలాల్లో వీఆర్ఓ, తాసిల్దార్, ఆర్డీఓ లాగిన్ లలో పెండింగ్ లో ఉన్న మ్యుటేషన్ ట్రాన్సాక్షన్ దరఖాస్తులను క్లియర్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన దరఖాస్తులను ఆన్లైన్లో నమోదు నమోదు చేయడంతో పాటు 45 రోజుల్లో రీసర్వే నిర్వహించి భూ సమస్యలను పరిష్కరించాలన్నారు.అలాగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను కూడా పెండింగ్ లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ సూచించారు. పెండింగ్లో ఉన్న కోర్టు కేసులకు కౌంటర్ వేయడంతో పాటు కోర్టు మధ్యంతర, తుది ఉత్తర్వులను ఖచ్చితంగా అమలు పరచాలన్నారు. ప్రతి మండలంలో పైలెట్ ప్రాతిపదికన గ్రామాన్ని ఎంపిక చేసుకుని గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూమి సరిహద్దులు గుర్తించి రీసర్వే పనులు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామసభ నిర్వహించే రోజు గ్రామస్తులందరికీ తెలిసేలా ముందుగానే టామ్ టామ్ వేయించి విస్తృత ప్రచారం చేయాలన్నారు.



## మత్స్యకారుల సంక్షేమమే కేంద్ర రాష్ట్రప్రభుత్వాల లక్ష్యం

**తెలుగుదేశం గత హాయాంలోనే మత్స్యకారులకు పెద్దపీట : నంద్యాల ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి**

**పగిడ్యాల, జనవరి 10, ప్రభాతవార్త**

మత్స్యకారుల సంక్షేమమే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల లక్ష్యమనీ నంద్యాల ఎంపి తెలుగుదేశంపార్టీ పార్లమెంటు ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం నెహ్రూనగర్ సమీపంలోని శ్రీశైలం జలాశయంలో శుక్రవారం 21లక్షల చేపపిల్లలను ఉచితంగా నంద్యాల జిల్లా జెడిఏ రాఘవరెడ్డి, డిడి శ్యామల ఎంపి బైరెడ్డి శబరి చేతులమీదుగా విడుదల చేయించారు. ఈ సందర్భంగా ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హాయాంనుండి మత్స్యకారులకు పెద్దపీటవేస్తు వస్తుందన్నారు. నంద్యాల జిల్లాలో మత స్యకారులకు మత్స్య సంపదను పెంపొందించు కోవడంతోపాటు సంపదతో ఎలా అభివృద్ధి చెందాలనీ మత్స్యకారు లకు అధికారుల సమన్వయ్యంతో వారికి అవగాహన కల్పించవలసిన అవశ్యకత ఎంతైనా వుందన్నారు. ప్రైవేటు వ్యక్తులు చేపపిల్లలను అమ్మినట్లు తమ దృష్టికి వచ్చిందనీ ఈవిషయంలో సంబంధించిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్రప్రభుత్వ పథకాలు వున్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకో వాలన్నారు. ప్రధానమంత్రి మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకారుల అర్థిక జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు ఎన్నోసంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందనీ వాటిని వినియోగించుకుని మత్స్యకారులు అభివృద్ధి చెందాలనీ నంద్యాల ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. మత్స్యశాఖ జాయింట్‌డైరెక్టర్ రాఘవ రెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం జలాశయం లో 21లక్షల చేపపిల్లలను విడుదల చేయడం జరిగిందన్నారు. ఉందులో 8,40లక్షలు కట్ల చేపపిల్లలు, 10.50లక్షల రోహు చేపపిల్లలు, 2.10లక్షల మ్రిగాల చేపపిల్లలను విడుదల చేయడం జరిగిందన్నారు.శ్రీశైలం నుండి పగిడ్యాల వరకు 4500మంది మత్స్యకారులు ఆత్మకూరు, కొత్తపల్లె, పాములపాడు, జూపాడుబంగ్లా పగిడ్యాల మండలాలకు కలిగిన మత్స్యకారులు లైసెన్సు కలిగినవారు జీవనోపాదిచేస్తున్నారన్నారు. శ్రీశైలం జలాశయం తగ్గినందువల్ల వారికి ఉపాధి అవకాలుకల్పించేవిధంగా నంద్యాల ఎంపి, ఎంఎల్ఏ కృషిచేస్తున్నారన్నారు. నంద్యాల జిల్లా, కర్నూలు జిల్లా సుంకేసుల, గాజులదిన్నె, రజోలివద్ద చిన్నచేపపిల్లను 6నెలలు పెంచి శ్రీశైలం జలాశయంలో విడుదలచేయడం జరుగుతుందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు మత్స్యకారుల అర్థిక అభివృద్ధిని పెంపొందించేందుకు ఎన్నో సంక్షేమపథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. మత్స్యకారులకు ద్విచక్రవాహనాలు, ఫోర్‌విల్లర్ ఫాపులకు పెట్టుబడులకోసం సబ్సిడి, మోబైల్ మార్కెట్ చేసుకోవడానికి, అదేవిధంగా బ్యాంకు రుణాలు తీసుకోవడానికి అవకాశాలు ఉన్నాయనీ వీటిని సద్వినియోగం చేసుకోవాలనీ రాఘవరెడ్డి అన్నారు. నిషేదితవలలను మత్స్యకారులు జలాశయంలో వేసి చేపలు పట్టరాదనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ డిప్యూటి డైరెక్టర్ శ్రీమతి శ్యామల, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీమతి సంద్యారాణి,మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు భరత్‌లాల్ నాయక్, ఇన్‌స్పెక్టర్ నాగరాజు, బాలరాజు, నందికొట్కూరు పురపాలసంఘం చైర్మెన్ దాసి సుధాకరరెడ్డి, పగిడ్యాల ఎంపిడిఓ శ్రీమతి సుమిత్రమ్మ, సర్పంచ్ కూరాకుల రాజేశ్వరి,మాజీ సింగిల్‌విండో చైర్మెన్ కట్టుబడి శ్రీనివాసులు నాయుడు, మత్స్యశాఖ సహాయకులు ఆనంద్, లోకేష్,అనోక్, ఉదయ్, శ్రీనివాస్, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరికి



## ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

**- వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు**



**మంత్రాలయం,జనవరి 10,ప్రభాతవార్త:**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి.పాతూరులో వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీమఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు.ఈ వేడుకల సందర భ్ంగా దేవాలయాన్ని వివిధ రకాల పూలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు.స్వామివారికి తులసిఅర్చన, పుష్పార్చన,మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. దేవాలయంలోని వైకుంఠ ద్వారాన్ని ప్రారంభించారు.అనంతరం భక్తులకు అనుగ్రహ సందేశం ఇచ్చారు.వైకుంఠ ఏకాదశి విశిష్టతను భక్తులకు తెలియజేశారు.ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీర్వాదం పొందారు.

## వైకుంఠ ఏకాదశి వేడుకల్లో పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులు

**బనగానపల్లెరూరల్, జనవరి10, ప్రభాతవార్త:**

బనగానపల్లె పట్టణంలోని స్థానిక కొండపేటలో గల శ్రీ లక్ష్మివెంకటేశ్వరస్వామి ఆలయం నందు శుక్రవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మరియు మౌలికసదుపాయాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆయన సతీమణి, రాష్ట్ర థాయ్‌బాక్సింగ్ చైర్‌పర్సన్ బీసీ ఇందిరారెడ్డిలు తాతా క్రలిక ఆలయ సెట్టింగ్‌లో కొలువుదీరిన శ్రీ లక్ష్మివెంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా బీసీ దంపతులు అక్కడికి చేరుకోగానే ఆలయ అర్చకులు,



వేదపండితులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి బీసీ దంపతులు ఆలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామివారిని ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు, టీడీపీ నంద్యాల పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, మల్లారెడ్డి, ఎస్టీసెల్ కృష్ణ నాయక్, ఎర్రబోలు శరత్ కుమార్‌రెడ్డి, ఎ ర్రబోలు పవన్ కుమార్‌రెడ్డి, టీచర్ నాగరాజు, కోడి నాగేష్‌బాబు, ఎస్ఎస్ఎం, కాసుల జంగంశెట్టి, బచ్చు భాస్కర్, బచ్చు శరత్ చంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తర ముఖద్వారం ద్వారా లక్ష్మీనరసింహాస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే అఖీల ప్రియ

**ఆళ్లగడ్డ, జనవరి 10, ప్రభాతవార్తః**

మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన అహోబిలంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహా స్వామిని శుక్రవారం వైకుంఠ ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీప్రహల్లాద వరదస్వామిని ఉత్తరముఖ ద్వారం ద్వారా బంధుమిత్రులతో టిడిపి



కార్యకర్తలతో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియ దర్శించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని శ్రీలక్ష్మీనరసింహా స్వామిని కోరుకున్నామన్నారు. తిరుమల ఘటనను దృష్టిలో వుంచుకొని ఎక్కడకూడ తొక్కిసలాటలు జరగకుండా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవాదాయ సిబ్బంది, పోలీస్‌శాఖ వారు భద్రత ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. ఆళ్లగడ్డ తాలూక ప్రజలకు కార్యకర్తలకు ముక్కోటి ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## జిల్లా మైనార్టీ అధ్యక్షునికి ఘన సన్మానం



**చాగలమర్రి, జనవరి 10, ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షబ్బీర్‌ను రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు శాలువలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈసందర ్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో కష్టపడడం వల్లనే పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి పార్టీ బలోపేతానికి నంద్యాల జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షబ్బీర్‌ను నియమించడం జరిగిందన్నారు. అనంతరం నంద్యాల జిల్లా మైనార్టీ అధ్యక్షుడు షబ్బీర్ మాట్లాడుతూ పార్టీ తనను గుర్తించి నంద్యాల జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా తనను నియమించడం పట్ల పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి, షేక్‌బాబులాల్‌కు, కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన పదవిని పార్టీ బలోపేతం కోసం తనవంతు కృషిచేస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలకు కూడ పనిచేసేవారికి పార్టీలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం ఆయన షేక్‌బాబులాల్‌ను, కుమార్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో నాయకులు చుందురు వెంకటరమణ, గణేష్‌రెడ్డి, గేట్ల మాబు, మాబుషరీఫ్, జాబీద్, ఖాదర్‌బాష, మండల ఉపాధ్యక్షులు ముల్లా రఫీ, పెయింటర్ రఫీ, బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు



**చాగలమర్రి, జనవరి 10, ప్రభాతవార్త:** మండలంలోని వివిధ గ్రామాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని మద్దూరు గ్రామంలో ఉత్తర ముఖద్వారం ద్వారా వెలసిన శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు మండలం నుంచే కాకుండా వివిధ తాలూకాల నుండి తెల్లవారు జామున 5 గంటల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తరముఖ ద్వారం ద్వారా స్వామిని దర్శించుకోవడం ద్వారా వైకుంఠం దర్శించుకోవడమే అని పలువురు భక్తులు పేర్కొన్నారు. అలాగే మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో యు. మాధవ, రామకృష్ణ, గోపాలకృష్ణ, రమేష్, సురేష్‌ల ఆధ్వర్యంలో శ్రీమూర్తి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవాలయాలకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## గురురాజ పాఠశాలలో సంక్రాంతి ముగ్గుల పోటీలు



**నంద్యాల, జనవరి 10, ప్రభాతవార్త:** నంద్యాల పట్టణంలోని ఎన్‌జిఓ కాలనీ నందు శ్రీగురురాజ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఉపాధ్యాయులకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈపోటీలను పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి ప్రారంభించారు. పాఠశాల అవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో సుమారు 200 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర ్భంగా షేక్షావలిరెడ్డి మాట్లాడుతూ సం క్రాంతి పండుగ రైతులకు ఎంతో ముఖ్యమని రైతులు ఆనందంతో జరుపుకునే పండుగ సంక్రాంతి అన్నారు. ఈసంక్రాంతి రోజున ఇళ్ళ ముంగిళ్లల్లో కలాపుచల్లి ముగ్గులతో అందంగా అలకరించుకునే తెలుగు సాంప్రదాయ సంక్రాంతి పండుగ అన్నారు. ముగ్గులే సంక్రాంతికి ప్రత్యేకత అన్నారు. ఉపాధ్యాయులు వేసిన ముగ్గులను జడ్జి లలితా సరస్వతీ పర్యవేక్షించి విజేతలను నిర్ణయించారు. విజేతలుగా నిలిచిన ఉపాధ్యాయులకు డైరెక్టర్ షేక్షావలిరెడ్డి చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

## యువత ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

**-జేఎన్‌యు విశ్వవిద్యాలయ ఉపకులపతి సదర్శన్‌రావు**



**నంద్యాల, జనవరి 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని నిరుద్యోగులుగా ఉన్న యువత ప్రభుత్వ ప్రైవేట్ రంగాల్లో ఉపాధి ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఉప కులపతి సుదర్శన్ రావు సూచించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంచి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని, ప్రభుత్వం నుండి విడుదలయ్యే నోటిఫికేషన్ వినియోగించుకోవాలని ప్రతిఒక్కరు ఉద్యోగం సాధించాలన్నారు. ప్రభుత్వ ప్రైవేట్‌రంగాల్లో కూడ యువత తమ నైపుణ్యంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు వినియోగించుకోవాలన్నారు. నంద్యాల శాంతిరాం మెడికల్ కళాశాలకు విచ్చేసిన ఉప కులపతి సుదర్శన్‌రావు, శాంతిరాం విద్యాసంస్థల చైర్మన్ శాంతిరాముడు, డైరెక్టర్ శివరాంల చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్‌నిరుద్యోగుల ఫోరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను అవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఎన్ఎఫ్ అధ్యక్షులు శ్రీరాములు, నవ్యాంధ్రప్రదేశ్ విద్యార్థి యువజన జేపిసి అధ్యక్షులు అయ్యస్వామి, ఆర్‌విఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాజునాయుడు, ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీ విద్యార్థి సంఘం అధ్యక్షులు వంక్కిరి రామచంద్రుడు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతినికేతన్ విద్యార్థుల ప్రతిభ

**నంద్యాల, జనవరి 10, ప్రభాతవార్త:** శ్రీశాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు రామానుజన్ సైన్స్‌మహోత్సవ ఒలంపియాడ్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ చూపారు. రాష్ట్రస్థాయిలో 7వ తరగతి విద్యార్థి సంతోష్ రెండవ ర్యాంకు సాధించారు. 8వ తరగతి విద్యార్థి హరిచరణ్ మూడవ ర్యాంకు సాధించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ సుధాకర్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి మెమోంటోలను సుధాకర్ చేతుల మీదుగా అందజేశారు. ఈసందర ్భంగా సుధాకర్ మాట్లాడుతూ విజయానికి కారణమైన ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని తల్లిదండ్రుల ప్రొత్సాహం ప్రశంసనీయమన్నారు. ఈఘనత పాఠశాల ప్రతిష్టను మరింత పెంచిందని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు ప్రతి విద్యార్థికి ప్రేరణగా నిలుస్తుందన్నారు.



## ఆర్బిట్ సేవలు సద్వినియోగం చేసుకోండి

**ఆదోనిలీగల్, జనవరి10, ప్రభాతవార్త;** పట్టణంలో ప్రసిద్ధిగాంచిన ఆర్బిట్ డయోగ్నస్టిక్ ల్యాబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్బిట్ ల్యాబ్ మేనేజర్ యు.సుధాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడారు. తమ ల్యాబ్‌లో అన్ని రకాలైన రక్త పరీక్షలు, సిటీ స్కాన్, అల్ట్రా సౌండ్, ఎక్స్ రే, ఈసీజీ తదితర పరీక్షలు రీజనబుల్‌గా రాయితీ పద్ధతిలో పేదలను దృష్టిలో ఉంచుకుని సేవలు అనుభవజ్ఞులైన డాక్టర్‌ల పర్యవేక్షణలో రోగులకు కచ్చితమైన నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎస్‌కేడీ కాలనీలోని మూడో రోడ్డులో ఉన్న తమ ఆర్బిట్ సంస్థ సేవలు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్నట్లు చెప్పారు.

## సామాజిక సేవలకు గుర్తింపుగా డాక్టరేట్ ప్రదానం

**– బి.సి. దుర్గేష్‌ను అభినందించిన సాయిభారతి సభ్యులు, సిబ్బంది**

**ఆదోనిలీగల్, జనవరి10, ప్రభాతవార్త;** ఆదోని పట్టణంలో సాయిభారతి విద్యాసంస్థల అధినేత బి.సి. దుర్గేష్‌కు డాక్టరేట్ అవార్డు రావడం అభినందనీయమని పాఠశాల సిబ్బంది పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా గుర్తింపు పొందిన యూనివర్సిటీ స్పింగ్ థియోలాజికల్, టెక్సెస్, గుడ్‌న్యూస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ స్టీవెన్, వైస్ ఛాన్సులర్ హైదరాబాద్‌లో అవార్డును అందుకోవడం హర్షణీయమన్నారు. విద్యారంగంలో 20 సంవత్సరాలుగా పేద విద్యార్థులకు అందించిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.

## అటెండర్ రాముడు మృతికి సంతాపం తెలిపిన ఎంపిడివో ప్రసాదరెడ్డి

**కొలిమిగుండ్ల, జనవరి10, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న రాముడు(60) గురువారం మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న ఎంపిడివో ప్రసాదరెడ్డి, కార్యాలయం సిబ్బంది శుక్రవారం మృతి చెందిన అటెండర్ రాముడు నివాసానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపిడివో ప్రసాదరెడ్డి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపి ఓదార్చారు. అదే విధంగా రాముడు అంత్యక్రియలకు మృతుడి భార్య నాగవేణమ్మకు రూ.25వేలు నగదును అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సునీత, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మిరప పంటలో చేతబడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి..!

**పెద్దకడుబూరు, జనవరి 10, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన పెద్దకడుబూరు గ్రామానికి చెందిన ఉప్పర ఈరన్న రైతు పొలంలో వేసిన మిరపపంటలో నిమ్మకాయలు, పసుపు, కుంకుమ చేతబడి చేసి తమకు నష్టం కలిగించేలా చేస్తున్నారని అటువంటి వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధిత రైతు శుక్రవారం విలేకర్లకు తెలిపారు. తమ పొలంలో మిరప పంట మధ్యలో చెట్లను తొలగించి చేతబడి చేశారని దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. గతంలో ఒకసారి చేతబడి చేయడం వల్ల తమ భార్య, తమ తండ్రికి ఆరోగ్య సమస్యలు వచ్చాయన్నారు. పూర్ణచంద్ర అనే యువకుడు ఈ చేతబడి చేసినట్లు తమకు తెలుసునని అతనిని గ్రామంలో తాత అని పిలుస్తారని అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. చేతబడితో తనకు ఎలాంటి సంబంధం లేదు.. : ఉప్పర ఈరన్న పొలంలో చేతబడి చేసిన దాంట్లో తనకు ఎలాంటి సంబంధం లేదని కావాలనే దురుద్దేశ్యంతో తనపై ఉప్పర ఈరన్న ఆరోపణలు చేస్తున్నారని పూర్ణచంద్ర అనే యువకుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉప్పర ఈరన్నకు వాళ్ల పెదనాన్నకు భూ సమస్యలు ఉన్నాయని, కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయని ఏమైనా ఉంటే వారు భూ సమస్యలు కోర్టులో చూసుకోవాలని అనవసరంగా వాటిని తమకు రుద్దే ప్రయత్నం చేస్తున్నారని పూర్ణచంద్ర వాపోయాడు.

## అభివృద్ధి సంక్షేమానికి టిడిపి ప్రధాన్యత

**శిరివెళ్ల, జనవరి 10, ప్రభాతవార్త:** శిరివెళ్ళ అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం పార్టీకి రెండు కళ్లలాంటివని మాజీ జడ్పీటిసి యామ గుర్రప్ప పేర్కొన్నారు. మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అదేశాల మేరకు మండల పరిధిలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా చేపడుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం మాదిరి కాకుండా సంక్షేమం ఒకవైపు అమలుచేస్తునే మరోవైపు అభివృద్ధి చేస్తున్నట్లు యామ గుర్రప్ప తెలిపారు. టిడిపి సభ్యత్వం శిరివెళ్లలో రికార్డుస్థాయిలో జరిగిందని పార్టీ సభ్యత్వం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు. విద్య, వైద్యం, భీమా వంటి సౌకర్యాలు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం వల్ల లభిస్తాయని టిడిపి శ్రేణులకు పార్టీ సభ్యత్వం ఒకధీమా అన్నారు.

## ఇంచార్జీ తహశీల్దార్‌గా రుద్రగౌడ్..

**కోసిగి, జనవరి 10, ప్రభాతవార్త:** కోసిగి మండల డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న జె.రుద్రగౌడ్‌ను ఇంచార్జీ తహశీల్దార్‌గా నియమించారు.. ఈ మేరకు శుక్రవారం రుద్రగౌడ్‌బాధ్యతలను స్వీకరించారు.. గతంలో ఇక్కడ తహశీల్దార్‌గా విదులు నిర్వర్తిస్తున్న నిత్యానందరాజు పదోన్నతిపై సబ్ కలెక్టర్‌గా వేరే జిల్లాకుబదిలీ కావడంతో ఆయన స్థానంలో ఇంచార్జీ బాధ్యతలను రుద్రగౌడ్‌కు అప్పగించారు.. ఈ సందర్భంగా రుద్రగౌడ్ మాట్లాడుతూ మండలంలో భూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చ ఏస్తానన్నారు..అనంతరం ఆయనకు వీఆర్‌వోలు, ఆఫీసు సిబ్బంది స్వాగతం పలికారు..

## బెలుంలో ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

**కొలిమిగుండ్ల, జనవరి10, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల పరిధిలోని బెలుం గ్రామంలో శుక్రవారం శ్రీకృష్ణ మందిరం నందు వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 6గంటల నుండి పూజా కార్యక్రమాలు నిర్వహించి 8గంటల నుండి శ్రీకృష్ణుడి విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం వై.వి.ఎస్.నారాయణరెడ్డిచే ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 1గంటకు అన్నదాన వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో బెలుం గ్రామ పెద్దలు, భక్తులు, పరిరక్షణ సమితి సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో గీతాశ్రమంలో కూడా వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించి భక్తులు పారాయణం చేశారు.

## ఘనంగా ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు

**అవుకు, జనవరి10, ప్రభాతవార్త:** అవుకులో వెలసిన శ్రీ భూలక్ష్మిసమేత చెన్నకేశవస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు కన్నులపండువగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజాము నుండి ఉత్తరద్వారం ద్వారా స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వేడుకల్లో భక్తులు వందలాది మందిగా పాల్గొని గ్రామోత్సవం నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అదే విధంగా గ్రామానికి సమీపంలో గల మద్దిలేటిస్వామి ఆలయంలో ఏకాదశి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురువారం సాయంకాలం నుండి భజనలతో స్వామివారిని స్మరించుకున్నారు. శుక్రవారం తెల్లవారుజాము నుండి అన్నదాన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

## మదర్‌మోడల్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

**అవుకు, జనవరి10, ప్రభాతవార్త:** అవుకు పట్టణంలోని మదర్ మోడల్ పాఠశాలలో కరస్పాండెంట్ ముచ్చలపురి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల చిన్నారులు సాంప్రదాయ దుస్తులను ధరించి పాఠశాల ఆవరణాన్ని పండుగ వాతావరణంలాగా మార్చేశారు. చిన్నారుల ఆటపాటలతో అందరిని అలరించారు. ఉపాధ్యాయునిలు సంక్రాంతి పండుగకు సంబంధించిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ భారతదేశ పండుగల్లో సంక్రాంతి పండుగ రైతులకు సిరి సంపదలను కురిపించే పండుగ అన్నారు. పాడిపంటలతో ప్రతి రైతు ఇంటా ధాన్యరాసులతో నిండి ఉంటుందన్నారు. విద్యార్థులకు సంక్రాంతి పర్వదిన గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ముచ్చలపురి రామసుబ్బమ్మ, ప్రిన్సిపాల్ ప్రమీలా, ప్రధానోపాధ్యాయులు రాయసం మురళీ మోహన్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గోనెగండ్లలో వైభవంగా వైకుంఠ ఏకాదశి

**గోనెగండ్ల జనవరి 10 ప్రభాతవార్త :** మండల పరిధిలోని గోనెగండ్లతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం వైకంఠ ఏకాదశి వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గోనెగండ్ల, గాజులదిన్నె, హెచ్ కైరవాడి, కులుమాల, అలువాల, వేముగోడు, చిన్నమరివీడు, పెద్దమరివీడు, అగ్రహారం, గంజహళ్ళి, గ్రామాల్లో ఉదయం నుంచే భక్తులతో వైష్ణవ, శైవ దేవాలయాలు కిక్కిరి పోయాయి. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోనెగండ్లలోని చింతాలముని నల్లారెడ్డి స్వామి దేవాలయంలో స్వామివారికి ఆకుపూజ, మహామంగళహరతి, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తులు భజన కార్యక్రమం నిర్వహించారు.

## ఈనెల 20 నుంచి గోనెగండ్లలో రిసర్వే పనులు ప్రారంభం

**గోనెగండ్ల జనవరి 10 ప్రభాతవార్త :** గోనెగండ్లను పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా జిల్లా అధికారులు గుర్తించారని అందులో బాగంగా ఈనెల 20వ తేది నుంచి గోనెగండ్ల లో రిసర్వే పనులు ప్రారంభం అవుతున్నట్లు తహశీల్దార్ కుమారస్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో రెవెన్యూ అధికారులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామంలోని బస్టాండ్ ప్రాంగణం నుంచి సంత మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం దగ్గర గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కుమారస్వామి మాట్లాడుతూ ఈ నెల 20వ తేది నుంచి మండల కేంద్రమైన గోనెగండ్లలో రిసర్వే పనులు ప్రారంభమవుతున్నాయన్నారు. నాలుగు టీమ్‌లను ఏర్పాటు చేశామని ఒక్క టీమ్ వారు రోజుకు 20ఎకరాలను సర్వే చేస్తారని తెలిపారు. రైతులకు అభ్యంతరం ఉంటే తెలపాలని కోరారు. సర్వే టీమ్‌లకు రైతులు గ్రామ పెద్దలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, టీడీపీ నాయకులు నజీర్‌సాహెబ్, రమేష్‌నాయుడు, రాజశేఖర్‌ఆచారి, టమోటా ఉస్సేన్, ఫకృద్దీన్, మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా తొలిఏకాదశి వేడుకలు కిటకిటలాడిని దేవాలయాలు



**కోవెలకుంట్ల, జనవరి 10, ప్రభాతవార్త:** వైకుంఠ, తొలిఏకాదశి వేడుకలు కోవెలకుంట్ల సబ్ డివిజన్ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. హిందువులకు తొలి పండుగ కావడముతో అన్ని దేవాలయాలు కిట కిటలాడాయి. ముఖ్యంగా వేంకటేశ్వర్ల స్వామి పాండురంగ స్వామి దేవాలయాల్లో భక్తులు వేల సంఖ్యలో పాల్గొని తమ ఇష్టదైవమైన విష్ణుమూర్తిని పూజించారు. పట్టణంలోని పాండురంగ స్వామి విష్ణు మూర్తికి ప్రతి రూపము కావడముతో ఇక్కడ భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. తెల్లవారు జామున 3గంటలకే స్త్రీ, పురుషులుపూజలో పాల్గొన్నారు. పట్టణంలోని కిలో మీటరు దూరము భక్తుల క్యూలైను కనిపించింది. మొత్తం మీద తొలిఏకాదశి ఘనంగా జరుపుకున్నారు.

## రీ సర్వే ప్రాజెక్టుపై ర్యాలీ..

**కోసిగి, జనవరి 10, ప్రభావార్త:** మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు రీ సర్వే కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు..ఈ సందర్భంగాతహశీల్దార్ రుద్రగౌడ్, ఆర్ఐలు శ్రీరాములు, తిక్కాస్వామిల ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.. అనంతరం గ్రామ సభనునిర్వహించారు.. ఈ సందర్భంగా తహశీల్దార్ రుద్రగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే ప్రాజెక్టు ప్రవేశ పెట్టిందని, ఇందులోభాగంగా కోసిగి మండలంలో చింతకుంట గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. కావున ఈ పైలెట్ ప్రాజెక్టుకింద వచ్చే అన్ని భూములను సరిచేసుకోవడం జరుగుతుందన్నారు. అందుకే ఈ అవకాశాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్, విఆర్‌వోలు బసవరాజు, యేసుదాసు, రామాంజి, శ్రీనివాసులు, మారెన్న, హనుమంతు, గ్రామ రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

## కులగననలో తప్పులు సవరించుకునేందుకు సమయం ఇవ్వాలి

**కొత్తపల్లె, జనవరి 10, ప్రభాతవార్త:** ఏపీలో ఎస్సీ కులగననలో తప్పులు సరిదిద్దుకునేందుకు ప్రభుత్వం సమయం ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఈ రాజు డిమాండ్ చేశారు. కొత్తపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కులగననలో తప్పులు సరిచేసుకునేందుకు ప్రభుత్వం ఈనెల 12 వరకు సమయం కేటాయించిందన్నారు. ఈతక్కువ సమయంలో తప్పులు సరిదిద్దుకోవడం సాధ్యం కాదని వాటిని సరిచేసుకునేందుకు మరో 10 రోజులు సమయం ఇవ్వాలన్నారు. ఇచ్చిన సమయంలో ఆత్మకూరు ప్రాంతంలో పవిత్రమైన ఇస్తేమాను మూడు రోజులు జరుపుకునేందుకు ముస్లింలకు ఇవ్వడంతో అధికారులు ఆ సభలకు సమయం కేటాయించడం, అలాగే 11న రెండవ శనివారం కావడం, 12న ఆదివారం కావడంతో తప్పులు సరిదిద్దుకునే సమయం లేకుండా పోయిందన్నారు. అదేవిధంగా కులగననపై అధికారులకు పూర్తి అవగాహన లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొక తప్పడం లేదనాన్నరు. ఈసమస్యలు దృష్టిలో ఉంచుకొని తప్పులు సరిచేసుకోవడానికి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడానికి మరో పదిరోజులు అవకాశం ఇవ్వాలన్నారు.

## వైకుంఠ ఏకాదశి సందర్భంగా పురవీధుల్లో ఊరేగిన సీతారాముల వారు

**కర్నూలు విద్య, జనవరి 10, ప్రభాతవార్త:** పాతబస్తీలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌పరిధిలో గల బజార్ రామాలయం పేటలో వెలసిన ఏకాంత రాముని రథోత్సవం శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా అంగరంగవైభవంగా భక్తులంతా గోవిందనామస్మరణ చేస్తుండగా ఆలయం నుండి పూలబజార్ బొగ్గుల బజార్, శ్రీనివాస క్లాత్‌మార్కెట్, మిచ్చిన్ బజార్ మీదుగా చిన్నమార్కెట్, కుమ్మరి వీధి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. గత 50 సంవత్సరాలుగా కర్నూలు నగరంలో ప్రముఖ వ్యాపారవేత్త దోమ ముక్కోటి ఏకాదశిరోజు శ్రీసీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ ఉత్సవమూర్తులకు నగరంలో దివ్యఉత్సవం అర్చకులు మాళిగి హనుమేశాచార్య, జయతీర్థ వేదవ్యాస, వ్యాసరాజు భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగవైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

**వెలుగోడు, జనవరి 10, ప్రభాతవార్త:** వెలుగోడు గ్రామంలో స్థానిక చెన్నకేశవస్వామి ఆలయం నందు ముక్కోటి ఏకాదశి సందర్భంగా పూజలు ఘనంగానిర్వహించారు. ఉదయం 4.45 గంటల నుండే దర్శనాలు మొదలయ్యాయి. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు నిర్వహించుకున్నారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో చిన్నపిల్లలతో కోలన్న ఆటలు, గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలో పురవీధుల వెంట స్వామివారి రథంతో ఊరేగింపు కోలన్న పాటలు పాడుతూ అలరించాయి. ఈకార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## భాదితులకు త్వరలోనే న్యాయం చేస్తాం

**:- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్**

**హోళగుంద, జనవరి 10, ప్రభాతవార్త:** భాదితులకు త్వరలోనే న్యాయం చేస్తామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన హోళగుందలో కోటవీధిలో నివసిస్తున్న మారెమ్మ అనే మహిళ సర్వేనంబర్ 365సి1సి 1ఎకరా52సెంట్ల భూమి గతంలో అవకతవకలు జరిగాయని ఇచ్చిన పత్రిక ప్రకటనలో భాగంగా శుక్రవారం సబ్‌కలెక్టర్ విచ్చారు. విచారణ నిమిత్తం పొలం వద్దకు వెళ్లి చుట్టుపక్కల ఉన్న రైతులు, గ్రామ విఆర్‌ఓలను ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవకతవకలు జరిగాయని రుజువైతే ఎంతటివారినైనా విడిచిపెట్టేది లేదన్నారు. ఈ సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామన్నారు. అలాగే పత్రికా విలేకర్లకు కూడా నివేదిక పంపుతామన్నారు. గ్రామ రైతులు సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయంలో దళారులు ఎక్కువగా ఉన్నారని వెంటనే వారికి అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సతీష్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్, విఆర్‌ఓ నాగరాజు, ప్రహ్లాద్, తిప్పన్న, సర్వేయర్ ఆచారి, శ్రీనివాసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముక్కోటి ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం

**పత్తికొండ, జనవరి 10, ప్రభాతవార్త** పట్టణంలోని కొత్తపేట ఆర్డీఓ కార్యాలయం వెనుక భావన సమీపంలో ఉన్న పురాతన లక్ష్మీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నందు ఉత్తర ద్వార దర్శనం 20వేల నుండి 25వేల మంది వరకు దర్శించుకున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. ఉదయం నాలుగు గంటలకు స్వామి వారి దర్శనం కోసం భక్తాదులు నిర్విరామంగా రాత్రి 9గంటల వరకు దర్శించుకున్నారు. ప్రతి ఏడాది ఈ ఏడాది భక్తులు పెద్దఎత్తున హాజరైనట్లు తెలిపారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ నిర్వాహకులు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండ చూసుకుని విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

## వైభవంగా ముక్కోటి ఏకాదశి

**ఆస్పరి, జనవరి 10, ప్రభాతవార్త:** మండల పరిధిలోని హలిగేర గ్రామ కొండలలో సహజ సిద్ధంగా ఉత్తర ముఖ ద్వారంలో వెలసిన మహిమాన్విత స్వయంభూ శ్రీహరి కూర్మనారాయణ (నల్లగుట్టయ్యస్వామి) క్షేత్రంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలను ఆలయ నిర్వాహకులు నరేష్ ఆద్వర్యంలో వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30గంటలకు సహజసిద్ధ ఉత్తర ద్వార ప్రవేశము ద్వారం శ్రీహరి కూర్మనారాయణ స్వామి దివ్య దర్శనం, విశేష అభిషేకం, అలంకరణ, సహస్ర నామార్చన, గిరి ప్రదక్షిణ, నాగదేవతల పుట్టలకు పూజా కార్యక్రమాలు చేశారు. ముక్కోటి ఏకాదశి రోజు ఉత్తర ద్వారంలో ఉన్న స్వామి వారిని దర్శించుకుంటే చాలా అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగమ్మ, ఎంపిపి సుంకర ఉమాదేవి, రామాంజినేయులు, శివమోహన్‌రెడ్డి, నాయుడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## గ్రామాల్లో 3సెంట్లు..పట్టణాల్లో 2సెంట్ల స్థలాలు ఇవ్వాలి

**హోళగుంద, జనవరి 10, ప్రభాతవార్త:** బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేదలకు గ్రామాల్లో 3సెంట్లు..పట్టణాల్లో 2సెంట్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి పెద్దహ్యాట మారెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించి తహశీల్దార్ సతీష్‌కు పెద్దహ్యాట గ్రామసదస్సులో వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హామీలు నెరవేర్చాలని కోరారు. అలాగే హోళగుందలో ఈబిసి కాలనీ నందు 2004నుండి భూ పోరాటం చేసి అక్కడ నివసిస్తున్న ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకుడు కృష్ణయ్య, ఏఐటియుసి మండల కార్యదర్శి రంగన్న, సిపిఐ నాయకులు వెంకన్న, యూసుఫ్, సలాంసాబ్, అమీర్, మహిళా సంఘం నాయకురాలు భూలక్ష్మి, వనిజమ్మ, మీనాక్షి, బసమ్మ, జాబిదమ్మ తదితరులున్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం..!

**ఆలూరు, జనవరి 10, ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆలూరు తెదేపా ఇంచార్జ్ వీరభద్రగౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని హత్తిబెళగల్ రోడ్డులో నూతనంగా నిర్మించిన గోకుల షెడ్డులను కార్యకర్తలతో కలిసి రిబ్బన్‌కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందన్నారు. అనంతరం వీరభద్రగౌడ్‌ను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపిడి, ఏపిఓ, మండల కన్వీనర్ అశోక్ యాదవ్, నాయకులు నరసప్ప, ఉగాది రాము, గోవిందు, ఈరన్న, వన్నూరువలి తదితరులు పాల్గొన్నారు.

## జంబులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి

**పగిడ్యాల, జనవరి 10, ప్రభాతవార్త :** పగిడ్యాల మండలం ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి స్వగ్రామమైన పాత ముచ్చుమర్రి గ్రామశివారులో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం వద్ద ఉన్న జంబులమ్మ దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. గత సంవత్సరం దేవాలయాన్ని నిర్మాణం చేసి ప్రారంభించడం జరిగింది. ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి వారు కొలుచే దేవతైన జంబులమ్మ దావాలయం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి వెంట గ్రామస్తులు పాల్గొన్నారు.

## గోకులం షెడ్డలను ప్రారంభించిన టిడిపి నాయకులు

**బండిఆత్మకూరు, జనవరి 10, ప్రభాతవార్త:** మండల వ్యాప్తంగా మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామిపథకం ద్వారా మంజూరైన 2,4, 6 పశువుల గోకులం షేడ్లను మండల టిడిపి నాయకులు నందిపాటి నరసింహారెడ్డి, లాయర్ కృష్ణారెడ్డి, టిడిపి నాయకులు ప్రారంభించారు. మండలంలోని సంతజూటూరు గ్రామంలో 6 పశువుల మినీ గోకులంను లాయర్ కృష్ణారెడ్డి, వెటర్నిటి డాక్టర్ అనుషా ప్రారంభించారు. ఈసందర ్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ పాడిపంటలు మన సంస్కృతికి పునాదులని ప్రారంభించామని ఏపీఓ వసుధ తెలిపారు. సంతజూటూరులో భూపాల్ లక్ష్మన్న, వెంగల్‌రెడ్డిపేటలో ఈశ్వరయ్య, కడమలకాల్వలో తిరుపతి, పెద్దదేవులాపురం రాజ గోపాల్, బోధనంలో బాల అంకన్న, నారాయణపురంలో షేక్ బాషా, ఈర్నపాదులో చంద్రకర్‌లను గోకులం షేడ్‌లను ప్రారంభించామని ఏపీఓ తెలిపారు. ఈకార్యక్రమంలో జెవిఓ నూర్ అహ్మద్, పంచాయితీ సెక్రెటరీ చౌదయ్య, ఈసి వరదరాజులు, టెక్నికల్ అసిస్టెంట్ స్వాములు, ఫిల్డ్ అసిస్టెంట్ జయసూర్య, గ్రామ పెద్దలు అన్నెపొగు సుబ్బరాయుడు, మాజీ సర్పంచ్ సత్యరాజు, గొల్ల తిరుపాలు, ప్రభాకర్‌రెడ్డి, దండే శివారెడ్డి, చెన్నయ్య, సుంకిరెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, ఆశేశ్వరుడు, నడిపి యల్లయ్య, గోపాలమిత్ర శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలో కష్టపడే వారికి ఎప్పుడు గుర్తింపు ఉంటుంది



**కర్నూలు అర్బన్, జనవరి 10, ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా వైసీపీ మైనార్టీ సెల్ అధ్యక్షులుగా నియమితులైన టిఎండి ఫిరోజ్ ఈసందర ్భంగా వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువ పూలమాలలతో సత్కరించారు. తనకు మైనార్టీ సెల్ అధ్యక్షుడి పదవి రావడానికి కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఎంతో కృషిచేశారని తెలిపారు. అనంతరం కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడే నాయకులకు, కార్యకర్తలకు పార్టీ గుర్తుపెట్టుకుంటుందని పదవులు వస్తాయని పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో వైసీపీ కర్నూలు జిల్లా కమిటీ జనరల్ సెక్రెటరీ అక్కిమి హనుమంతరెడ్డి, మరియు నాయకులు, కార్యకర్తలు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా వైకుంఠ ఏకాదశి పూజలు

**వెల్దుర్తి, జనవరి10, ప్రభాతవార్త:** వెల్దుర్తి మండలంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. వెల్దుర్తి పట్టణంలోని జర్నలిస్టుకాలనీలో వెలసిన శ్రీలక్ష్మీవెంకటేశ్వరసద్గురుసాయినాథ అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు యార్లపాటి శ్రీధర్‌శర్మ అర్చకత్వమున వెంకటేశ్వరస్వామి అమ్మవార్ల కళ్యాణం అశేషభక్త జనుల నడుమ నిర్వహించారు. అదేవిధంగా రామళ్లకోట గ్రామంలో వనంశ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్ల కళ్యాణాన్ని వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ గ్రామపెద్దలు, భక్తుల సమక్షంలో జరిపించారు. మదార్‌పురం గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో వెంకటేశ్వరస్వామి కళ్యాణం జరిపించారు. ఆయా ఆలయాల్లో స్వామివారు భక్తులకు ఉత్తర ద్వార దర్శనమిచ్చారు. అనంతరం భక్తులందరికి అన్నదానం ఏర్పాటుచేశారు. గ్రామపెద్దలకు, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

## బాలాజీ స్కూల్ పై చర్యలు తీసుకోవాలి

**కౌతాళం, జనవరి10, ప్రభాతవార్త:** సంక్రాంతి సెలవుల్లో తరగతులు నిర్వహించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ మంత్రాలయం తాలూకా ఉపాధ్యక్షులు కె.మంజునాథ్, కౌతాళం మండలాధ్యక్షుడు సాయివర్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని కుంటనహాల్ గ్రామంలోని శ్రీ బాలాజీ ఇంగ్లిష్ మీడియం ప్రయివేట్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి సెలవులు ఉన్నన కూడా విచ్చలవిడిగా క్లాసులు నిర్వహిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. బాలాజీ ప్రయివేట్ స్కూల్‌ను సీజ్ చేసి గుర్తింపు రద్దు చేయాలన్నారు. విద్యాశాఖ అధికారులను కోరారు. సంక్రాంతి రోజుల్లో క్లాసులు నిర్వహించ రాదని యాజమాన్యంకు చెప్పినా నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారన్నారు. వెంటనే విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి హనుమేష్, స్వామి, గురు, మహేష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చిన వెంకటేశ్వరస్వామి

**ఆత్మకూరు, జనవరి10, ప్రభాతవార్త:** వైకుంఠ ఏకాదశి పండుగను పురష్కరించుకునేందుకు భక్తాదులు తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో తరలి వచ్చి శ్రీ వెంకటేశ్వరస్వామి ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శన బాగ్యం కల్పించారు. శుక్రవారం పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తాదులకు వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా భక్తులు విశేష పూజలు దీపోత్సవాలు, వివిధ రకల పూజలను నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే పోలీసు సిబ్బంది భక్తులకు ఎలాంటి ఆటంకం కలకుండా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాము, ఎస్ఐలు వెంకటనారాయణరెడ్డి, సురేష్, భక్తాదులకు క్యూలైన్ పద్దతిలో వెళ్లేందుకు పోలీసుల సేవలు అందించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు వెంకటేశ్వరస్వామి సన్నిదిలో పూజలు అందుకున్నారు. వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం ముగ్గించుకోని భక్తులకు వివిధ అలంకరణలో వెంకటేశ్వరస్వామి దర్శనం కల్పించారు.

# ఏడు నెలలైనా .. గూడు చూపని కూటమి ప్రభుత్వం

– తక్షణమే ఇళ్ల మంజూరు చేయాలని సిపిఐ ధర్నా

**కోడుమూరు,జనవరి 10, ప్రభాతవార్త :** ఎన్నికల్లో గూడు లేని నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామన్న కూటమి ప్రభుత్వం హామిచ్చి ఏడునెలలైనా ..గూడు కల్పించని కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శుక్రవారం కోడుమూరు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తాహాశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ధర్నానుద్దేశించి మండల సిపిఐ కార్యదర్శి రాజు మాట్లాడుతూ పేదలకు ఇస్తామన్న సంక్షేమ పథకాలను కూడా గాలికొదిలేసిందని ఆరోపిస్తూ కూటమి ప్రభుత్వ వైఖరిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇంటి స్థలం ఉండే వారందరికీ 5 లక్షల రూపాలయలు మంజూరు చేస్తామని వాటితో ఇంటి నిర్మాణాలను చేసుకునే అవకాశాలు కల్పిస్తామని కూటమి ప్రభుత వ్ం పెద్ద ఎత్తున ప్రకటనలు గుప్పించందన్నారు. అంతే గాక కోడుమూరు పట్టణంలో గత 30 ఏళ్లుగా ఇంద్రజిత్తు కాలనిల్లో నివాసాలుంటున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వడంలో ఇక్కడి అధికారులు ఘోరంగా విఫలమయ్యారన్నారు. ఈ విషయంపై అనేక సార్లు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోయినా పట్టంచుకోవడం లేదని మండిపడ్డారు. జానెడు జాగ కోసం ఏళ్ల ఎదురుచూసే పేదలకు స్థలం చూపని పాలక వర్గాలకు పేదల కష్టాలు కనపడవన్నారు. అలాగే పట్టణంలో పలుకుబడితో ప్రభుత్వ స్థలాను యథేశ్చగా కబ్జా చేసే వారంతా ధర్జాగా నివాసాలుంటున్నారని ఆందోళనవ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇప్పటికైన కూటమి ప్రభుత్వం స్పందించి గూడు లేని ప్రతి పేద వారికి ఇంటి స్థలాలు చూపాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలాలపై కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తే సిపిఐ పార్టీ దశల వారిగా పోరాటాలకు సిద్ధం అవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ అనుబంధ సంస్థల ప్రతినిధులు మధు,బజారి, సుంకన్న, మద్దిలేటి, రంగస్వామి, సులోచనమ్మలు పాల్గొన్నారు. అనంతరం సిపిఐ పార్టీ నాయకులు అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ తాహాశీల్దార్ వెంకటేష్ నాయక్‌కు వినతి పత్రంను అందజేశారు.




# పురోభివృద్ధికి దోహదపడేవే పండుగలు

–డాఆక్టర్ మల్లు వెంకటరెడ్డి

**జూపాడుబంగ్లా, జనవరి 10,ప్రభాతవార్త:** సామాజిక భాధ్యతను గుర్తు చేసి పురోభివృద్ధికి దోహదపడేవే పండుగలు అని వాటి వెనుక ఉన్న పరమార్థాన్ని తెలుసుకోవాలని అప్పుడే భారతీయ సంస్కృతి యొక్క ఔన్నత్యాన్ని తెలుసుకోవచ్చునని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామంలోని శ్రీరామాలయంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సంధర్భంగా గోపూజ, కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన ప్రవచించారు. మూడు రోజుల పాటు శ్రీమద్రామాయణం,మహాభారతం,భగవద్గీతలపై తితిదే ధర్మా చార్యులు ఆమంచి వేంకటేశ్వర్లు చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు లోకేశ్వర్‌రెడ్డి, భజన మండలి అధ్యక్షుడు మండ్ల రాముడు, ధర్మప్రచార మండి సభ్యులు పి.రామచంద్రుడు, శివశంకర్‌రెడ్డి, శివారెడ్డి, పాపయ్యాచారి, వెంకటస్వామి, జనార్ధన్‌రెడ్డి, డోలక్ మాస్టర్, తెలుగు వేంకటేశ్వర్లు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రియాశీలకంగా పనిచేసిన ప్రతికార్యకర్తకు పార్టీలో గర్తింపు



**చాగలమ ర్రి, జనవరి 10, ప్రభాతవార్తః** క్రియాశీలకంగా పనిచేసిన ప్రతికార్యకర్తకు పార్టీలో మంచి గుర్తింపు లభిస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మహాబూబ్ వలి కాలనీలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గెలుపోటములు సహజమని అంతమాత్రాన కార్యకర్తలు ఏవరు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదన్నారు. పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ ఓడిందని ఎక్కడ కూడ జంకకుండా పార్టీ బలోపేతానికి ముందడు వేస్తున్నారన్నారు. కార్యకర్తలు కూడ ఎక్కడ భయపడాల్సిన అవసరం లేదని ముందడుగు వేసి పార్టీకోసం పనిచేయాలన్నారు. ముందుకు వస్తే అధికారపార్టీ నాయకులు ఏమనుకుంటోరనని జంకకుండా పనిచేయాలన్నారు. అధికార పార్టీ చేసే తప్పులే మన పార్టీకి బలం చేకూరుతుందన్నారు. ఎన్నో హామిలుఇచ్చిన టిడిపి ఇప్పటి వరకు హామిలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని ఈవిషయాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. మనపార్టీ అధికారంలో ఉన్నప్పుడు పేద ప్రజలకు ఎన్నో సంక్షేమపథకాలు అందించామని తెలిపారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ పార్టీ అధికారంలోకి వచ్చి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారన్నారు. కార్యకర్తల బలం పూనాదులే పార్టీకి బలం చేకూరుస్తుందన్నారు. పార్టీలో మరింత మందికి పదవులు లభించే అవకాశం ఉందన్నారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ముల్లా రఫీ, వైసీపీ రాష్ట్ర సేవాదల్‌కార్యదర్శి చుందురు వెంకటరమణ, మండల యూత్ అధ్యక్షులు వార్డు మెంబర్ పెయింటర్ షరీప్, ఖాదర్‌బాష, జాకీర్, గేట్ల మాబు, గణేష్‌రెడ్డి, ప్రచారకార్యదర్శి పెయింటర్ రఫీ, చిన్న బికారి, బాలుడు, బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోరంట్ల మాధవుడి సన్నిధికి పోటెత్తిన భక్తులు

– దేవాలయాల దగ్గర సందడే.. సందడి

– ఉత్తర ద్వారం ద్వారా స్వామి వార్ల దర్శనం కల్పించిన ఆలయ కమిటి



**కోడుమూరు,జనవరి 10, ప్రభాతవార్తః** కోడుమూరు మండలంలో ఆయా గ్రామాలల్లో వెలసిన వైష్ణవ దేవాలయాలల్లో శుక్రవారం జరిగిన వైకుంఠ ఏకాదశి వేడుకలు కన్నుల పండుగలా సాగాయి. కర్నూలు జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గోరంట్ల గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీమాధవ స్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలొచ్చి స్వామి వార్లను దర్శించుకున్నారు. స్వామి సన్నిధికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటి నిర్వాహకులు ఆలయం దగ్గర ప్రత్యేక కూలైన్లు ఏర్పాటు చేశారు. అంతే గాక స్వామి వార్లను దర్శించుకునేందుకు వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కోడుమూరు ఎస్.ఐ ఎ.పి శ్రీనివాసులు ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. అదే విధంగా మండలంలోని వెంకటగిరి గ్రామంలో వెలసిన శ్రీగిడ్డాంజినేయ స్వామి సన్నిధిల్లో కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలొచ్చి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు గావించారు. అదే విధంగా కోడుమూరు పట్టణంలో శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి సన్నిధిలో కూడా ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇక్కడ రాత్రి వ్రెంకటేశ్వరస్వామి కళ్యాణ ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించనున్నారు. మండలంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో భక్తులు విశేషంగా పూజా కార్యాక్రమాలను నిర్వహించారు. అన్ని చోట్ల వైకుంఠ ఏకాదశి వేడుకలను భక్తులు భక్తి శ్రద్దలతో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఏకాదశి వేడుకల సందర్భంగా వచ్చే భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

# స్నేహితుడి కుటుంబానికి అండగా పూర్వ విద్యార్థులు

:- రూ.21వేలు ఆర్థిక సహాయం



**పెద్దకడుబూరు,జనవరి 10,ప్రభాతవార్త:** తమతో పాటు చదువుకున్న స్నేహితుడు అకస్మాత్తుగా మరణించడంతో అతని కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో పూర్వ విద్యార్థులు ముందుకొచ్చారు. మండల కేంద్రమైన పెద్దకడు బూరు గ్రామానికి చెందిన నరసింహులు ఇటీవల అనారోగ్యంతో అకస్మాత్తుగా మృతిచెందాడు. అతనితో పాటు చదువుకున్న 2004-05 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు చేయిచేయి కలిపి రూ.21వేలు పోగు చేసి తన స్నేహితుడు నరసింహులు కుటుంబానికి అందచేసి అండగా నిలిచారు. స్నేహితులు చేసిన సహకారానికి గ్రామస్తులు అభినందించారు. స్నేహితుడు చనిపోయినా తమ స్నేహాన్ని చాటుకున్నారని పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు సత్య, రామన్న,పక్కీరప్ప,రామాం జనేయులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్కు పంపిణీ



**మంత్రాలయం,జనవరి 10,ప్రభాతవార్త:** మండల పరిధిలోని కల్లుదేవకుంట గ్రామంలో ఉన్న సహకార సంఘంలో సభ్యుడుగా ఉన్నరైతు కుటుం బానికి సహకార సంఘ ం అధికారులు ఇనూ ్సరెన్ ్స చెక్కును పంపిణీ చేశారు.వివరాల మేరకు కల్లుదేవకుంట సహకార సంఘం పరిధిలో ఉన్న సింగరాజనహళ్ళి గ్రామానికి చెందిన తగరం ఈరన్న అనేరైతు సహకార సంఘంలో పంటఋణం తీసుకుంటూ పంటకు ఇన్సూరెన్ ్స చెల్లించాడు.జెపి ఇనూ ్సరెన్ ్సలో భాగంగా ఈ ఇనూ ్సరెన్ ్స నగదును చెల్లించాడు.అయితే రైతు ఈరన్న గతకొద్ది రోజులక్రితం రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యాడు.ఇందుకు సహకార సంఘం అధికారులు రైతు కుటుంబానికి రూ.2 లక్షలు ఇనూ ్సరెన్ ్స నగదును మంజూరు చేయించారు.ఈ ఇనూ ్సరెన్ ్స చెక్కును పిఐసి రమాదేవి,ఎమ్మిగనూరు డిసిసిబి మేనేజర్ గోపాల్‌నాయక్,కల్లుదేవకుంట సహకార సంఘం ఇంఛార్జ్ సిఈఓ వెంకటేష్ చేతులమీదుగా రైతు ఈరన్న భార్యకు అందజేశారు.ఈ సందర్భంగా రైతుభార్య అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సింగరాజనహళ్ళి సర్పంచ్ మధుసుదన్‌రెడ్డి,సూపర్‌వైజర్ ఇమ్మానుయేలు సిబ్బంది మోహన్,కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీ-సర్వే పగడ్బందీగా నిర్వహిస్తాం



**చెట్నహళ్ళి(మంత్రాలయం),జనవరి 10,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని భూముల రీ-సర్వే పగడ్బందీగా నిర్వహిస్తామని మండల తహశిల్దార్ సల్కాపురం రవి అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని చెట్నహళ్ళి గ్రామంలో రీ-సర్వే గ్రామసభ అవగాహన ర్యాలీకార్యక్రమం నిర్వహించారు.ఇందులో భాగంగా గ్రామంలోని పురవీధులగుండా ర్యాలీ నిర్వహించి భూముల రీ-సర్వేపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భూముల రీ-సర్వేకు చెట్నహళ్ళి గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసిందన్నారు.ఈనెల 20వ తారీఖునుండి గ్రామంలోని భూములను రీ-సర్వే చేస్తామన్నారు.రెవిన్యూ అధికారులు నాలుగు టీంలుగా ఏర్పడి రైతులకు ఎటువంటిఇబ్బందులు రాకుండా రైతుల సమక్షంలోనే భూములను రీ-సర్వే చేస్తామన్నారు.కావున రెవిన్యూ అధికారులు రైతులకు సమాచారం ఇచ్చినప్పుడుతప్పకుండా తమపొలాల వద్దకు రావాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ బెస్త ఆంజనేయులు,ఎంపిటిసి రామాంజినేయులు,రీ-సర్వే డిటి సరస్వతి,మండల సర్వేయర్ అశోక్,విఆర్ఓ భీమయ్య,గ్రామ సర్వేయర్ నవీన్ అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# గోకులం షెడ్లతో పశువులకు రక్షణ..భద్రత



**నంద్యాల టెక్కె, 10 జనవరి, ప్రభాతవార్త:** గోకులం షెడ్ల నిర్మాణంతో పశువులకు రక్షణ, భద్రత ఉంటుందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. నంద్యాల మండల ఎంపీడీఓ సుగుణ శ్రీ ఆధ్వర్యంలో ఏపీఓ శ్రీ కళ నేతృత్వంలో మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద పశుసంవర్ధక శాఖ సమన్వయంతో కానాల (హెచ్ఎస్ కొట్టాల), పాండురంగాపురం, మిట్నాల, పుసులూరు, పోలూరు గ్రామాల్లో నిర్మించిన మినీ గోకులం షెడ్లను శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. పల్లెపండుగ కార్యక్రమాల్లో భాగంగా పాడిరైతులకు బాసటగా వారికి ప్రోత్సాహకరంగా ఉండేందుకు గోకులం షెడ్లను ఏర్పాట్లు చేయడం జరిగిందని ఎంపీడీఓ సుగుణ శ్రీ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ శెట్టి ప్రభాకర్, గ్రామ సర్పంచ్‌లు, పశు సంవర్ధకశాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం



**రుద్రవరం, జనవరి 10, ప్రభాతవార్తః** మండలం లోని చిలకలూరు గ్రామ పంచాయితీ సర్పంచ్ గోపవరం ప్రసాద్‌రెడ్డి అన్నపూర్ణమ్మ దంపతులు శుక్రవారం అన్నదా నం చేసి మానవతా దృక్పదాన్ని చాటుకున్నారు. సుదూర ప్రాంతాల నుండి ఎర్రగుంట్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యసేవలు పొందుతున్న మహిళలకు స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అన్నిదానాల కన్నా అన్నదానం మహా గొప్పదని అందులోను గర్భిణి, బాలింత మహిళలకు వారి కుటుంబ సభ్యులకు అన్నదానం చేయడం ఒక పుణ్యఫలమని పేర్కొన్నారు. వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తు ఎందరో మహిళలకు అన్నదానం నిర్వహించి ప్రత్యక్షంగా పరోక్షంగా కారణమవుతూ మానవతా దృక్పదాన్ని చాటుకున్న వివేకానంద సొసైటి సేవలను వారు కొనియాడారు. అనంతరం వైద్యాధికారులు షబ్బీర్ వలి, భవ్యశ్రీలు, వైద్యసిబ్బంది, ట్రస్ట్ సభ్యులు పూలమాలలతో శాలువలతో సర్పంచ్ దంపతులను ఘనంగా సన్మానించారు.

# ఎస్టీ,ఎస్సీజిల్లా విజలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా నవీన్

**నంద్యాల హాస్పటల్,జనవరి 10,ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా ఎస్సీ,ఎస్టీ జిల్లా విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సభ్యులుగా నంద్యాలకు చెందిన యువజన ప్రజా సంఘల నాయకులు ముద్దం నాగనవీన్ నియమితులయ్యారు. గత 15 సంవత్సరాలుగా ప్రజా సేవలో బడుగు బలహీన వర్గాలకు, అణగారిన దళిత వర్గాలకు ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఆయనను నియమించినట్లుగా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# న తరిగోపులలో బండలాగుడు పోటీలు

**జూపాడుబంగ్లా,జనవరి 10,ప్రభాతవార్త:** శ్రీఅనంత నాగేశ్వర స్వామిశ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి సంక్రాంతి తిరునాల సంధర్భంగా మండల పరిధిలోని తరిగోపుల గ్రామంలో ఈ నెల 13న న్యూ క్యాటగిరి సైజు గల వృషబాల బండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లుగా కగ్రామ సర్పంచ్ అంజనమ్మ తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వృషబాలకు దాతల ద్వారా 1వ బహుమతి రూ. 50 వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు, నాలుగవ బహుమతి రూ.20 వేలు, అయిదవ బహుమతి రూ.10 వేలు, ఆరవ బహుమతి రూ.5 వేలు దాతల ద్వారా అందజేయ బడుతాయని నిర్వాహకులు తెలిపారు, **14న కబడ్డీ పోటీలు :-**సంక్రాంతి తిరునాల సంధర్భంగా తరిగోపుల గ్రామంలో స్తానిక జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో ఈ నెల 14న కబడ్డీ పోటీలు నిర్వహించబడుతాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు 1వ బహుమతి రూ.20 వేలు, రెండవ బహుమతి రూ.10 వేలు,మూడవ బహుమతి రూ.5 వేలు, నాలుగవ బహుమతి రూ.2500లు దాతల ద్వారా అందజేయబడుతాయని వారు తెలిపారు.

# నాగరాజు మృతి కళారంగానికి తీరనిలోటు



**నందికొట్కూరు,జనవరి 10,ప్రభాతవార్త:** గత 30 సంవత్సరాలుగా కళారంగంలో తెలుగు పద్య నాటకాలలో రాణించిన మండ్లెం నాగరాజు మృతి కళారంగానికి తీరనిలోటని కళాకారుల సంఘం అధ్యక్షుడు జయరాముడు తెలిపారు. శుక్రవారం స్తానిక జైకిసాన్ పార్కులో సంతాప సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళీలు అర్పించారు. ఈ సంధర్భంగా పలువురు మాట్లాడుతు నాలక రంగంలో విభిన్న పాత్రలలో నాగరాజు రాణించి అందరి హృదయాలలో నిలిచాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఖాదర్‌బాబు, పులిపాటి రామకృష్ణ, పక్కీరయ్య, మధు, వేంకటేశ్వర్లు, సాంభశివప్ప, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు ఆపండి.. కూలీలు దొరక్క రైతులు విలవిలా..!

**మద్దికెర,జనవరి 10,ప్రభాతవార్త:** రైతునే రాజు చేద్దాం అన్న ఈ సమాజంలో ఆ పేరు అలాగే నిలచిపోయింది. రైతుకష్టాల్లో ఉన్నప్పుడు కనికరించాల్సిన ప్రభుత్వాలు అధికారులు కనుకరించ కపోవడంతో రైతుల విలవిలలాడుతున్నారు. మద్దికెర మండలంలో దాదాపు 500కుపైగా మేటీల గ్రూపు కలిగి వున్నాయి. ఉపాధి పనులు కల్పించాలని ప్రభుత్వాలు ఆదేశాలు ఇవ్వడం అధికారులు అమలు పరచడంలో నిమగ్నమై ఉన్నారు. రైతులు మాత్రం వారు వేసిన పంటలో కలుపు తీయడానికి కూలీలు లేక నిరుత్సాహానికి గురయ్యారు. ఉపాధి కూలీకి వెళ్లిన కూలీలు లేక నిరుత్సాహానికి గురయ్యారు. ఉపాధి కూలీకి వెళ్లిన కూలీలు 10గంటలలోపు రూ.200లకుపైగా సంపాదించడం జరుగుతూ ఉండడంతో ఎక్కువమంది కూలీలు ఉపాధి హామీ పనిపై ఇష్టపడుతున్నారు. రైతు పనులకు రూ.300లకు పైగా ఇస్తామన్నప్పటికీ కూలీలు రైతు పనిచేయడానికి ఇష్టపడడం లేదన్నారు. దీంతో ఉపాధి హామీ పథకం పనిని ఆపాలని పలువురు రైతులు ప్రభుత్వ పెద్దలను అధికారులను కోరుతున్నారు.

# పులికనుమ ప్రాజెక్టు నుండి పల్లెపాడు వరకు సాగునీరు అందిస్తాం..!

:- టిడిపి మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న



**పెద్దకడుబూరు,జనవరి 10,ప్రభాతవార్త:** సిఎం చంద్ర బాబునాయుడు సహకారంతో పైరయ్య ఆంజనేయస్వామి ఆశీస్సులతో పులికనుమ ప్రాజెక్టు నుండి బసలదొడ్డిలో ఉన్న చింతల చెరువు ద్వారా పల్లెపాడు వరకు సాగునీరు అందిస్తామని టిడిపి మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న అన్నారు. శుక్రవారం నీటికి సంబంధించి ఇంజనీర్లు పులికనుమ రిజర్వాయర్ నుండి చింతల చెరువు మీదుగా డిప్యూటీ ఈఈ కిష్టన్న,ఏఈఈసిఎస్ శ్రీనివాసులు,హసీనా, లక్ష్మీదేవిలు సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులికనుమ ప్రాజెక్టు ద్వారా పల్లెపాడు వరకు ఉన్న పొలాలకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం నుండి అనుమతి తీసుకోవడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి ఇంజనీర్లు సర్వే పనులు ప్రారంభించారన్నారు. సర్వే పనులు పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన తర్వాత సాగునీరు అందించేందుకు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. దీంతో వందలాది ఎకరాలకు బసలదొడ్డి చింతల చెరువు ద్వారా సాగునీరు అందుతుందన్నారు. సర్వే పనులు వేగంగా పూర్తి చేసేందుకు రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుడ్డా అంజినమ్మ,శ్రీరాములు,టిడిపి సీనియర్ నాయకులు పల్లెపాడు రామిరెడ్డి,డొప్పి ఈరన్న,మల్లేష్,హనుమయ్య,డి మల్లేష్,రాజశేఖర్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు ఇళ్లు,ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి




**దేవనకొండ,జనవరి 10,ప్రభాతవార్త:** అర్హులైన పేదలకు ఇళ్లు,ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి ఎం నరసారావు,ఏపి వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సి కృష్ణ,జె హరికృష్ణలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ,ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితిల పిలుపుమేరకు శుక్రవారం దేవనకొండలో తహశీల్దార్ కార్యాలయం ముందు జరిగిన ఆందోళనలో అర్హులైన లబ్దిదారులతో ఇళ్లు,ఇళ్ల స్థలాల కోసం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి కె భాస్కర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలు పట్టణాలకు దూరంగా నివాసయోగ్యం కాని ప్రాంతాలలో కేటాయించడం జరిగిందని,ఇప్పటివరకు ఇళ్ల స్థలాలు చూపలేదన్నారు. అర్హులందరిని గుర్తించి గ్రామాల్లో మూడుసెంట్లు,పట్టణాల్లో రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ,వ్యకాస నాయకులు తిమ్మప్ప,నరసిం హులు,భాష, నాగేశ్వర రావు, శ్రీనివాసులు, రామాంజి,మధు, రఫి,నరేష్,సూరి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి

**రుద్రవరం, జనవరి 10, ప్రభాతవార్తః** మండల కేంద్రం రుద్రవరంలోని కాశీవిశ్వేశ్వర ఆంజనేయస్వామి, లక్ష్మీవెంకటేశ్వరస్వామి, దొర్ని ్వ లక్ష్మీనరసింహస్వామి, వాసాపుర వెంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు పలు దేవాలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం వేకువజాము నుంచి ఉత్తరద్వారం ద్వారా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా అయా దేవాలయాల్లో అర్చన, కళ్యాణం, గ్రామోత ్సవం నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు వాసాపురం వెంకటేశ్వరస్వామి, లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఫలహారంతో పాటు భోజనవసతులు కూడ కల్పించారు. వైకుంఠ సందర్భంగా ఆలయాలోల డిఎస్పీ రవికుమార్ పర్యవేక్షణలో శిరివెళ్ళ సిఐ వంశీధర్, రుద్రవరం ఎస్ వరప్రసాద్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌బందోబస్తు నిర్వహించారు.

# హంద్రీనీవా కాలువ విస్తరణ తర్వాతే పనులు చేపట్టాలి



**దేవనకొండ,జనవరి 10,ప్రభాతవార్త:** హంద్రీనీవా కాలువ విస్తరణ తర్వాతే పనులు చేపట్టాలని సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్ డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ ఆద్వర్యంలో శుక్రవారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హంద్రీనీవా నుండి కుప్పం వరకు నీళ్ల తీసుకోవాలనే నిర్ణయం మంచిదేనని అయితే హంద్రీనీవా కాలువ విస్తరణ పూర్తి చేయడం అలాగే హంద్రీనీవా సామర్థ్యాన్ని కూడా పెంచాలన్నారు. రైతుల మనోభావాలు దృష్టిలో ఉంచుకుని హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు వెంటనే చేపట్టాలన్నారు. లేకపోతే ప్రజల నుండి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు అశోక్‌భాష,సిఐటియు సీనియర్ నాయకులు నాగేష్,నాగేంద్ర,రంగన్న,రామాంజనేయులు, హనుమంతు,తుఫాను రైతులు పాల్గొన్నారు.

# 20న రాయలసీమ జిల్లాల రాజ్యాంగ పరిరక్షణ సదస్సును జయప్రదం చేయండి

**ఆలూరు,జనవరి 10,ప్రభాతవార్త:** ఈ నెల 20న కర్నూలు రాజ్‌విహార్ దగ్గరున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్‌లో సిపిఐఎంఎల్ లిబరేషన్ రాయలసీమ జిల్లాల రాజ్యాంగ పరిరక్షణ సదస్సును జయప్రదం చేయాలని సిపిఐఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు నాగరాజు,బోయ ముని స్వామిలు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని కోర్టు కార్యాలయం వద్ద కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సమైక్యత,మతసామరస్యం,ేస్వచ్ఛ,సమానత్వం,ప్రజాస్వామ్యం,ప్రగతి బాటలో ముందుకు అడుగేద్దామని భారత రాజ్యాంగంపై బిజెపి కుట్రను తిప్పికొట్టి భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని,దేశాన్ని రక్షించుకుం దామన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగానికి, మహిళలు,విద్యార్థులకు ఎవ్వరికి ఎటువంటి రక్షణ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ ఉద్యమ స్ఫూర్తితో పోరాడి సాధించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పజెప్పి దేశ సంపదను లూటీ చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర విభజన అనంతరం దాశాబ్దకాలంగా మన రాష్ట్రానికి కేంద్రం తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఐషా, విద్యార్థులు రాజు,రంజాన్‌భాషా, వెంకటేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి ఘటన బాధాకరం..

:- ఘటనపై న్యాయవిచారణ జరిపించాలి

:- ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చిప్పగిరి లక్ష్మినారాయణ



**ఆలూరు,జనవరి 10,ప్రభాతవార్త:** పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతి ఘటన అత్యంత బాధాకరమని ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్ జ్ఞ చిప్పగిరి లక్ష్మినారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి దర్శనం టోకన్ల కోసం వచ్చిన భక్తులు తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని జరిగిన ఘటనపై న్యాయవిచారణ జరిపించాలని అలాగే మృతుల కుటుంబాలకు ఆలూరు కాంగ్రెస్ కమిటీ తరుపున ప్రగాఢ సానుభూతిని,సంతాపాన్ని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థాన చరిత్రలో తొలిసారి విషాద సంఘటన అని అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం ఈ ఘటనకు కారణం కావచ్చని మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ప్రభుత్వం ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిసి కూడా కనీస ఏర్పాట్లు చేయకపోవడం పాలన యంత్రాంగం వైఫల్యానికి నిదర్శనమని ఆరుగురు భక్తులు చనిపోయిన ఘటనపై నైతిక బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం వహించాలన్నారు. చనిపోయిన కుటుంబాలకు రూ.25లక్షలు పరిహారం చెల్లించి చేతులు దులుపుకోవడం అన్యాయమని ఒక్కో కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలని వారి ఇంట్లో అర్హులుంటే ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆయన కోరారు.

# తంగరడోనలో అయ్యప్పస్వాముల ఇరుముడి



**తుగ్గలి,జనవరి 10,ప్రభాతవార్త:** మండల పరిధిలోని తంగరడోన గ్రామంలో అయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వామి నరసప్ప ఆద్వర్యంలో 22మంది అయ్యప్ప స్వాములకు ఇరుముడి కట్టి శబరిమలై శుక్రవారం బయలుదేరారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ ఎంతో నియమనీష్టలతో 41రోజులు అయ్యప్ప మాల ధరించి పూజలు చేసుకున్నారు. ముందుగా ఉదయం అయ్యప్ప ఆలయంలో స్వామి వారికి ఆకుపూజ, పుష్పాభిషేకం,పడిపూజ చేసి మహామంగళారతితో ఇరుముడి కార్యక్రమాన్ని ముగించారు. సాయంత్రం 5గంటలకు అయ్యప్పస్వామి దేవాలయం నుంచి అయ్యప్ప స్వాములు మేళతాళాలలతో అయ్యప్పస్వామి పాటల చిందులు వేసుకుంటూ చింతలాముని స్వామి దేవాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి స్వామి వారి ఆలయంలో పూజలు చేసి శబరికి బయలుదేరి వెళ్లారు. ఇరుముడి కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున, రంగస్వామి, నాగరాజు, వీరేష్,రవి, సాయితేజ, నల్లారెడ్డి,అశోక్,మహాలింగ తదితరులు పాల్గొన్నారు.

# మినీ గోకులం షెడ్లు ప్రారంభోత్సవం

**తుగ్గలి,జనవరి 10,ప్రభాతవార్త:** మండల పరిధిలోని జొన్నగిరి,రాంపల్లి, ముక్కెళ్ల,శభాష్‌పురం, ఎల్లమ్మ,గుట్టతాండ,కడుమకుంట్ల గ్రామాలలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన మినీ గోకులం షెడ్లను,సిసిరోడ్లను ఎంపిడిఓ విశ్వమోహన్,ఏపిఓ హేమసుందర్,ఈసి ప్రదీప్ కుమార్‌లు,రాంపల్లిలో టిడిపి పార్టీ మండల అధ్యక్షుడు తిరుపాల్‌నాయుడు, మాజీ ఎంపిటిసి సభ్యుడు శ్రీనివాసులు, జొన్నగిరిలో టిడిపి నాయకులు బాలన్న,విద్యాకమిటీ చైర్మన్ రవి,లక్ష్మణస్వామి,హోటల్ మల్లీ,బిసి సెల్ మండల అధ్యక్షుడు సంఘాల కృష్ణ,శభాష్‌పురం గ్రామంలో ఆదినారాయణ,సుధాకర్‌గౌడ్,చిన్న పెద్దయ్యలతో కలిసి ప్రారంభించారు. మినీ గోకులం షెడ్ల రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో అన్ని రంగాలతో పాటు పాడి తీర్చేందుకు మినీ గోకులాలను నిర్మించి వారి పాడి పరిశ్రమల అభివృద్ధికి బాసటగా నిలుస్తోందన్నారు. అలాగే గ్రామాలలో అన్నారు. ఈ కార్యక్రమంలో జొన్నగిరిలో టిపి జిసి రామాంజనేయులు, సీనియర్ మేటీలు కావలి అంజి,జై చంద్ర,రాంపల్లిలో టిపి జైచంద్ర,ఫీల్డ్ అసిస్టెంట్ హేమాద్రినాయుడు, శభాష్‌పురంలో ఫీల్డ్ అసిస్టెంట్ మోహన్‌తో పాటు సచివాలయ సిబ్బంది, మరింతమంది టిడిపి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే ఆర్థిక సంవత్సర పంట రుణ ప్రణాళిక సిద్ధం చేయండి

**: జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల, జనవరి 10ప్రభాతవార్త ప్రతినిధి :**



202526 ఆర్థిక సంవత్సర పంట వార్షిక రుణ ప్రణాళిక సిద్ధం చేయాలని సంబంధిత అధికారులు, బ్యాంకర్లను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రభుత్వ పథకాల రుణ ప్రణాళిక రూపకల్పనపై సంబంధిత అధికారులు, బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ జేడీఎం సుబ్బారెడ్డి, యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ నరసింహారావు, ఎల్ డి ఎం రవీంద్ర కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి మురలీకృష్ణ, జిల్లా పరిశ్రమవర్ధక శాఖ అధికారి గోవిందు నాయక్, మత్స్యశాఖ జెడి రాఘవరెడ్డి, , ఏపీజీబీ రీజినల్ మేనేజర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ 202526 ఆర్థిక సంవత్సర పంట వార్షిక రుణ ప్రణాళిక సిద్ధం చేయాలని వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలు బ్యాంకర్లను సూచించారు. రైతులు ఏ ఏ పంటలు వేసుకుంటారు, ఏ పంటకు ఎంత రుణం వస్తుంది తదితర అంశాలను విశ్లేషించి నివేదికలు తయారు చేయాలని కలెక్టర్ వ్యవసాయ,ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో సిసిఆర్సి కార్డులు మంజూరు చేసిన కౌలు రైతులందరికీ అర్హత మేరకు రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్ఓఎఫ్ఆర్ భూముల రైతులకు, సూక్ష్మసేద్య పరిశ్రమలకు, మహిళా సాధికారత ఉపాధికి, విద్యా రుణాలు, గృహ రుణాలు, చేనేత రుణాలు, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన తదితర ప్రాధాన్యత రంగాలకు లక్ష్యం మేరకు రుణాలను పెంచాలని కలెక్టర్ బ్యాంకర్లను సూచించారు. ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పరిశ్రమల యూనిట్ల స్థాపనకు పెద్ద ఎత్తున ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో అర్హులైన యూనిట్ల లబ్ధిదారులందరికీ రుణాలు మంజూరు చేయాలన్నారు.



**రాష్ట్ర మంత్రివర్యులు టీజీ భరత్ గారి కుమార్తె వివాహ రిసెప్షన్ కు హాజరైన కేంద్ర మంత్రివర్యులు శ్రీనివాస్ వర్మ గారు**

## మిడుతూరులో వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వారా దర్శనం..



**మిడుతూరు జనవరి 10 ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన మిడుతూరులోని శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి దేవాలయంలో, పీరు సాహెబ్ పేట, దేవనూరు గ్రామాలలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాలలో వైకుంఠ ఏకాదశి పవిత్ర పర్వదిన సందర్భంగా స్వామి అమ్మవార్ల ఉత్తర ద్వారా దర్శనం అనుగ్రహం కలిగింది. ఉదయం నుండి భక్తులు సతీసమేతంగా పిల్లలతో దేవాలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేసి స్వామి అమ్మవార్ల ఆశీర్వాదం పొందారు. అదేవిధంగా శ్రీదేవి భూదేవి సమేత ఆపద్బాంధవుడు అనాథ రక్షకుడు కోరిన కోరికలు తీర్చే కోదండరాయుడు,కలియుగ శ్రీనివాసుడైన శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా భక్తులు సమక్షంలో కనుల విందుగా జరిగింది. అనంతరం భక్తులకు స్వామి అమ్మవార్ల ఆశీర్వాదం అందజేస్తూ తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి దేవనూరులో కొలువైన శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లగా వేద పండితులు, ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా, మాజీ సర్పంచ్ తిరినగరి నాగేంద్రుడు, నరసింహ గౌడ్, జనార్ధన గౌడ్, తోపాటు స్థానికులు, ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

## గ్రామసభల ద్వారా భూ సమస్యలు పరిష్కారం..!

**– సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్**



**ఆదోని,జనవరి 10,ప్రభాతవార్త**
గ్రామసభల ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టులో భాగంగా మండలంలోని పెసలబండ గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎన్నిక కావడంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి,గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభల ద్వారా గ్రామంలో నెలకొన్న భూ సమస్యలు ఏవైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకొస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. కావున గ్రామస్తులు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శివరాముడు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య,రీసర్వే ఉపతహశీల్దార్ పెద్దయ్య,సర్పంచ్ నరసింహులు,ఎంపిటిసి హనుమంతు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## శ్రీరంగాపురంలో బండలాగుడు పోటీలు



**వెల్దుర్తి, జనవరి10, ప్రభాతవార్త**
మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం పాలుట్ల రంగస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు రైతుసంబరాలకు వచ్చిన వారికి అన్నదానంను దాతలు,గ్రామపెద్దలతో కలిసి ఏర్పాటుచేశారు. ఈ వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని బండలాగుడు పోటీలు నిర్వహించారు. డాక్టర్. గురునాథ్(డోన్ మండలం,కొత్తకోట గ్రామం)కు చెందిన వృషభాలు ప్రథమ బహుమతి సాధించి రూ.40వేలు గెలుచుకున్నాయి. రెండోస్థానంలో ప్యాపిలి మండలం తొప్పల(శ్రీనివాసులు,గదా ్వల జిల్లా శనగపల్లె గ్రామానికి చెందిన చక్రవర్తి గౌడ్‌కు చెందిన వృషభాలు సంయుక్తంగా రూ.30వేలు గెలుచుకున్నారు. ఇక మిడుతూరు మండలం కట్టుబడి రోలిమేడమ్‌కు చెందిన వృషభాలు 3వ స్థానంలో నిలిచి రూ.20వేలు గెలుచుకున్నాయి. వైఎస్సార్ కడప జిల్లా గొల్లపల్లి గ్రామానికి చెందిన వారాధి రాంచరణ్‌కు చెందిన వృషభాలు నాలుగోస్థానంలో నిలిచి రూ.10వేలు గెలుచుకోగా, ప్యాపిలి మండలం,డి.రంగాపురం గ్రామం జుటూరు చిన్నారెడ్డికి చెందిన వృషభాలు అనంతపురం జిల్లా అరకటివేముల గ్రామానికి చెందిన పరిమి సోమశేఖర్‌నాయుడుకు చెందిన వృషభాలు సంయుక్తంగా ఐదవ బహుమతిని రూ.5వేలు గెలుపొందారు. విజేతలకు గ్రామపెద్దలు, దాతలు,నిర్వహుకులు కలిసి నగదును అందజేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

**బనగానపల్లెరూరల్, జనవరి10, ప్రభాతవార్త:**



బనగానపల్లె పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని శుక్రవారం రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్యసేవల వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రిలో అవసరమైన మందులు, పరికరాలు, మెడికల్ కిట్లు వంటివి అందుబాటులో ఉంచుకోవాలని వైద్యులకు సూచించారు. రోగులకు అందుతున్న వైద్య సదుపాయాల పై తానే స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఆసుపత్రిని పరిశుభ్రంగా, ప్లాస్టిక్ రహితంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రికి కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలు, సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆసుపత్రికి వచ్చే రోగులు ఓపీలో నిరీక్షణ సమయం పై అసంతృప్తి వ్యక్తం చేయడంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు త్వరితగతిన వైద్యసేవలు అందించాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

**బాలుర సాంఘిక సంక్షేమ హాస్టల్ మరియు పాఠశాలను పరిశీలించిన మంత్రి బీసీ :** బనగానపల్లె పట్టణ శివార్లలో గల రవ్వలకొండ పై ఉన్న బాలుర సాంఘిక సంక్షేమ హాస్టల్ మరియు పాఠశాలను రా ష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ మేరకు హాస్టల్ మరియు పాఠశాల అపరిశుభ్రంగా ఉండడంతో అధికారుల పై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే హాస్టల్ మరియు పాఠశాలకు అవసరమైన మేరకు మరమ్మతులు చేసి రంగులు వేయాలని మంత్రి సూచించారు. సాంఘిక సంక్షేమ హాస్టల్‌నే పాఠశాలగా వినియోగిస్తున్న నేపథ్యంలో వేరు వేరు భవనాలు ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అనంతరం కొత్తగా పాఠశాల తరగతుల భవన నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు.

## భాధితులకు న్యాయం చేస్తాం

**– సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్**



**హొళగుంద,జనవరి 10,ప్రభాతవార్త**
భాదితులకు త్వరలోనే న్యాయం చేస్తామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన హొళగుందలో కోటవీధిలో నివసిస్తున్న మారెమ్మ అనే మహిళ సర్వేనంబర్ 365సి1సి 1ఎకరా52సెంట్ల భూమి గతంలో అవకతవకలు జరిగాయని ఇచ్చిన పత్రిక ప్రకటనలో భాగంగా శుక్రవారం సబ్‌కలెక్టర్ విచ్చారు. విచారణ నిమిత్తం పొలం వద్దకు వెళ్లి చుట్టుపక్కల ఉన్న రైతులు,గ్రామ విఆర్ఓలను ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవకతవకలు జరిగాయని రుజువైతే ఎంతటివారినైనా విడిచిపెట్టేది లేదన్నారు. ఈ సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామన్నారు. అలాగే పత్రికా విలేకర్లకు కూడా నివేదిక పంపుతామన్నారు. గ్రామ రైతులు సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయంలో దళారులు ఎక్కువగా ఉన్నారని వెంటనే వారికి అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సతీష్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్, విఆర్ఓ నాగరాజు, ప్రహ్లాద్, తిప్పన్న, సర్వేయర్ ఆచారి, శ్రీనివాసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యూత్ కల్చరల్ ఫెస్టివల్ నిర్వహించడం కర్నూలుకు గర్వకారణం

**–రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్**

**కర్నూలు విద్య, జనవరి 10, ప్రభాతవార్తః**



సౌత్ ఏషియా పేస్ కాన్ఫరెన్స్ మరియు ఇంటర్నేనల్‌యూత్ ఫెస్టివల్ ఇక్కడ జరగడం కర్నూలు నగరానికి గర్వకారణమని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. టీజీవి ఫైన్ ఆర్ట్స్ ప్రథమ వార్షికోత ్సవ సందర్భంగా నగర శివారులో ఉన్న మాంటి సోరీ ఇండస్ స్కూల్ నందు ఈకార్యక్రమాన్ని టీజీ వెంకటేష్ జాతీయ పతాకాన్ని అవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ శాంతి పరిరక్షణ కోసం వివిధ దేశాల నుంచి ప్రతినిధులు రావడం ఆనందంగా ఉందన్నారు. వివిద ప్రాంతాల సంస్కృతి సాంప్రదాయాలను ప్రారంభిస్తు యువతలో చైతన్యాని ్న కల్పిస్తు సమైక్యత భావాన్ని పెంపొందించడానికి ఈకార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ముఖ్యంగా ల్యాంగేజి ఎక్ఛేంజ్, కల్చరల్ ఎక్ఛేంజ్ సాంస్కృతిక ప్రదర్శనలు, శాంతి సందేశాలతో కూడిన క్లాసులు వినియోగించుకొని దేశానికి దేశభవిష్యత్తుకు యువత ఉపయోగపడాలన్నారు. మూడురోజులు జరిగే కార్యక్రమంలో పాల్గొనే యువత సత్‌బావవన్ సత్ సాంప్రదాయాలతో విలువైన సంస్కృ తి నేర్చుకోవాలని టీజీ కోరారు. ఈకార్యక్రమంలో మాంటిసోరి విద్యాసంస్థల డైరెక్టర్ రాజశేఖర్, ఢిల్లీ పార్లమెంటులో మీడియా అర్గనైజర్ కీర్తి గోపాల్, రాజీవ్, గౌరి తదితరులు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రర్ కార్యాలయం పరిధిలో.. మిని పార్కు తలపించే విదంగా సేవలు..!

**: ఆహ్లాదకరమైన వాతవరణం కల్పించే విదంగా చొరువ**
**: సంవత్సరాల తరబడి మరుగునపడ్డా ప్రాంతాని పార్కుల తయారు**
**: సబ్ రిజిస్ట్రర్ కార్యాలయం పక్కన రూపురేకలు మారుతున్న వైనం**





**ఆత్మకూరు, జనవరి10, ప్రభాతవార్త:**
సంవత్సరాల తరబడి విషసర్పాల మధ్యలో ప్రభుత్వ ఉదో ్యగులు విధులు నిర్వహించి భయందోళనతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చి విధులు నిర్వహించే వారు. ప్రస్తుతం కంప్యూటర్ యుగం మారుతున్న నేపథ్యంలో మరుగునపడ్డా స్థలాలను స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మిని పార్కులను తలపించే విదంగా ఆకుల సలాం సేవలు విస్తృతంగా కొనసాగిస్తున్న నేపథ్యంలో పట్టణ ప్రజలను అందరిని ఆచర్యానికి గురిచేస్తుంది. ప్రస్తుతం పట్టణంలోని సబ్‌రిస్ట్రర్ కార్యాలయం పక్కన పిచ్చి మొక్కలు, విష సర్పరాలకు ఆవాసాలుగా ఉన్న ప్రదేశంను మిని పార్కును తలపించే విదంగా ప్రత్యేక చొరవ తీసుకోని ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఆహ్లదకరమైన వాతవరణంను కల్పించే విదంగా ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలోనే సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయం పక్కన సిమెంట్ బ్రిక్స్, మంచి వాతవరణం కల్పించే విదంగా ప్రతే ్యక అభివృద్ధి కొనసాగుతుంది. త్వరలోనే ఈ పనులు పూర్తి అవుతే ప్రభుత్వ అధికారులకు, ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఈ మిని పార్కును తలపించే విదంగా తయారు అవడం అందరిని ఆచర్య పరుస్తుండడంతో ఆకుల సలాం బాష సేవలు మరింత ఉపయోగకరంగా ఉన్నాయి. పట్టణంలో పేద ప్రజలకు ఏ కష్టం వచ్చిన నేను ఉన్నాంటూ ముందుకు వచ్చి తన దగ్గర ఉన్న సహాయంను కాదనకుండా తక్షణమే అందించే స్వచ్ఛంద సేవకుడు ఆకుల సలాంబాష వీటితోపాటు అనేక స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టి నేటి యువతరానికి ఆదర్శంగా నిలిచారు. మరో అద్భుతమైన పనిని చేసి ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు మా సేవలు ఇలాగే ఉంటాయని మరోసారి ఆకుల సలాం బాష నిరూపించుకున్నారు.

## చదువుతోనే బంగారు భవిష్యత్తు ఉంటుంది

**-ఎంపీ బస్తిపాటి నాగరాజు**



**కర్నూలు హాస్పిటల్, జనవరి 10, ప్రభాతవార్తః**
చదువుతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందన్న విషయాన్ని ప్రతిఒక్కరు గుర్తుంచుకోవాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. నగరంలోని కేవిఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, బిక్యాంపులోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో నిర్వహించిన కళాశాలల వార్షికోత ్స కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ చదువుతో ఉన్నత శిఖరాలను అందుకోలరని తాను ప్రభుత్వ కళాశాలల్లోనే చదువుకున్నానని ప్రభుత్వ కళాశాలల సమస్యలు తనకు తెలుసని ఎంపీ బస్తిపాటి పేర్కొన్నారు. ప్రభుత్వ స్కూల్స్ కళాశాలల్లో చదువుకున్న విద్యార్థులలో ఏదైనా సాధించాలన్న కసి, పట్టుదల ఎక్కువగా ఉంటుందన్నారు. తనకు వచ్చే ఎంపీ నిధులతో ప్రభుత్వ కళాశాలలను అభివృద్ధి చేస్తానని విద్యార్థులు బాగ చదువుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. తన ఎంపీ నిధుల నుండి కేవిఆర్ కళాశాలకు రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు.

## టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం...

**– ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్**
**– మాచనూరులో మినీ గోకులం షెడ్లను ప్రారంభించిన టీడీపీ ఇన్‌చార్జి**

**హాలహర్వి, జనవరి10, ప్రభాతవార్త;**



రాష్ట్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమవుతుందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మాచనూరు గ్రామంలో మినీ గోకులం షెడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబునాయుడు మినీ గోకులం షెడ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఒక్కో గోకులం షెడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.1.90 లక్షలు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. రైతులు గోకులం షెడ్లను నిర్మించుకోవాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రైతుల సంక్షేమం కోసం, రైతు భరోసా, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర, తదితర సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం చంద్రబాబునాయుడికే దక్కుతుందన్నారు. మండలానికి ప్రభుత్వం 46 గోకులం షెడ్లను మంజూరు చేసిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, ఎంపీడీఓ వరలక్ష్మి, టీడీపీ నాయకులు శ్రీధర్, క్రిష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి పార్టి జిల్లా ప్రదాన కార్యదర్శిగా యల్‌వి సుదాకరరెడ్డి



**కోవెలకుంట్ల, జనవరి 10,ప్రభాతవార్త**
నంద్యాల జిల్లా వైయస్‌ఆర్‌సి పార్టి ప్రదానకార్యదరి ్శగా వెలగటూరు గ్రామ సర్పంచు యల్‌వి సుదాకరరెడ్డిని నియమించారు. మంచి వాయిస్ పోరాట ప్రతిమ కలిగిన యువ నాయుడుగా పేరుంది. అలాగే బనగానపల్లె మాజీ యంయల ్ఎ కాటసాని రామిరెడ్డికి వీరవిదేయుడు కావడముతో అయనకు ఈపదవి వరించింది. తొలి ఏకాది దశి కావడముతో శుక్రవారము యల్‌వి సుదాకరరెడ్డి, మండల వైసిపి నాయకులు భీమిరెడ్డి ప్రతాపరెడ్డి, గుంజలపాడు మాజీ సర్పంచు, ముక్కమల్ల రామసుబ్బారెడ్డి కాటసాని కలిసి కృతజ్ఞ తలు తెలిపారు. అనంతనము అయనకను శాలువ కప్పి సనా ్మనించారు.

## దిమ్మెకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**మంత్రాలయం, జనవరి 10, ప్రభాతవార్త:**



మంత్రాలయం మండలం మాధవరం పోలిస్ స్టేషన్ పరిధిలోని తుంగభద్ర రైల్వేస్టేషన్ సమీపంలో సిమెంటు దిమ్మెకు ఉరేసుకుని ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్‌కానిస్టేబుల్ వీరేష్ తెలిపిన వివరాల మేరకు రైల్వేస్టేషన్‌కు కొంతదూరంలో ఉన్న రైల్వేట్రాక్ పక్కనగల సిమెంట్ దిమ్మెకు ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తికి సుమారు 35 సం.ల వయసు ఉంటుందన్నారు. మృతిచెందిన వ్యక్తి బూడిదరంగు ఎలాస్టిక్ ప్యాంటు ధరించినట్లు పేర్కొన్నారు. మృతదేహం వద్ద క్రీమ్‌కలర్ అంగి ఉన్నట్లు స్పష్టం చేశారు. వ్యక్తి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. విఆర్ఓ పుష్పలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# మిడుతూరుకు శుభపరిణామం..

**: దేవాలయ చైర్మన్ కాతా రాముల రెడ్డి..**

**మిడుతూరు జనవరి 10 ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన మిడుతూరు గ్రామానికి మంచి రోజులు వచ్చాయని, శుభపరిణామమైన పనులు ఆరంభమయ్యాయని అభయాంజనేయ స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ కాతా రాముల రెడ్డి అన్నారు. మిడుతూరు సమీపంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం ఆవరణలో 29 అడుగుల తో నిర్మించబోతున్న అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట నిర్మాణానికి వైకుంఠ ఏకాదశి రోజైనా పవిత్రమైన శుక్రవారం వేద పండితులైన మురళీకృష్ణ, రఘురామ శర్మ, భార్గవ్ శర్మ పర్యవేక్షణలో పూజలు మొదలయ్యాయి. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, మాండవహారాధన ,శంకు అభిషేకం, గణపతి హోమం ,నవగ్రహ హోమం ,మాన్యుసూక్త హోమం, వాసు హోమం ,పూర్ణాహుతి కార్యక్రమంతో పూజా కార్యక్రమం ముగిసింది. ఈ పూజా కార్యక్రమంలో కాతా కార్తీక్ రెడ్డి, తేజస్వి,తువ్వా రామ నాగేశ్వర్ రెడ్డి, శ్రీదేవి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాతా రాముల రెడ్డి మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు ఉన్నాయని ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట ఏర్పాటుతో గ్రామానికి ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. గ్రామ ఆరంభంలో ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుతోపాటు, బచ్చు నాగ సురేష్ సహకారంతో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ముఖద్వారం నిర్మాణం కూడా చేపడుతున్నామన్నారు. ఆంజనేయ స్వామి విగ్రహ రూప పనులు కూడా మొదలయ్యాయని, అందరు సహాయ సహకారాలతో యజ్ఞం లాంటి ఈ కార్యక్రమాన్ని చేయి చేయి కలిపి పూర్తి చేస్తామన్నారు. ఎంతో పవిత్రంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి అందరూ ఏకతాటిపై చేరుకొని పూర్తి చేసుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బన్నూరు నాగిరెడ్డి, గంగి రెడ్డి గారి శ్రీనాథరెడ్డి, భూమా కృష్ణమోహన్, కొండా నారాయణ, వడ్డే నగేష్, బన్నూరు రామకృష్ణారెడ్డి, రామ మోహన్, మోలాలి, జక్కుల వెంకటరమణ, కృష్ణమ్మ గారి రవి, బంగారు నాగేంద్ర, కట్టుబడి వెంకట్లు, తదితరులు పాల్గొన్నారు.